# చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలపై బిజెపి దాడి

ఆర్ ఎస్ ఎస్ x భారతదేశం

# చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలపై బిజెపి దాడి


రచన

**అమర్ ఫరూఖి**

**ప్రబీర్ పురకాయస్థ**

**డా॥ ఆర్.పి. బహుగుణ**

**ప్రొఫెసర్ పి. గోపీనాథ్**

**ఆర్.ఎస్.ఎస్ అధీకృతం**

అనువాదం

**ధనుంజయరావు**



## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

TITLE : Assault on Science and History in India

ప్రథమ ముద్రణ : మే, 2016

వెల : ₹. 20/-

ప్రతులకు

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్
27-1-64, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ -520 002, ఫోన్ : 0866 - 2577533.

బ్రాంచీలు
విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు,
ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ
website : www.psbh.in
psbhap@gmail.com

121261

# విషయసూచిక


- ప్రవేశిక

  **బృందాకరత్** **7**

- చరిత్ర, విజ్ఞాన శాస్త్రం మీద దాడి

  ***అమర్ ఫరూఖి*** ***11***

- ప్రాచీనవిజ్ఞానశాస్త్రం – హిందూత్వ

  **ప్రబీర్ పురకాయస్థ** **23**

- చరిత్రలో కాలనిర్ణయానికి సంబంధించిన వక్రీకరణల గురించి

  ***డా॥ ఆర్.పి. బహుగుణ*** ***37***

- వివిధ సంస్థలను స్వాధీనం చేసుకుంటున్న ఆర్.ఎస్.ఎస్

  **ప్రొఫెసర్ పి. గోపీనాథ్** **50**

- వివిధ సంస్థల స్వాధీనం – ఆర్.ఎస్.ఎస్ మార్గం

  ***ఆర్.ఎస్.ఎస్ అధీకృతం*** ***60***

# ప్రవేశిక

భారతదేశ వ్యతిరేకి ఆరెస్సెస్ అన్న శీర్షికన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆరు లఘు గ్రంథాలను ప్రచురించింది.

ప్రముఖ మేధావులు, రాజకీయ నాయకులు తదితరుల రచనలతో యీ లఘు గ్రంథాలు కూడి వున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించిన నాటినుండి నేటి వరకు అది నిర్వహించిన, నిర్వహిస్తున్న తిరోగమన, విచ్ఛిన్నకర పాత్రను యీ లఘు గ్రంథాలు సాకల్యంగా వివరిస్తున్నాయి.

ఇవి: 1) ఖాకీనిక్కర్లు కాషాయధ్వజాలు 2) ఆర్.ఎస్.ఎస్. సైద్ధాంతిక కపటత్వం 3) గొడ్డు మాంస రాజకీయం మత విద్వేష వ్యూహం 4) ఆర్.ఎస్.ఎస్, బిజెపి ఆధ్వర్యంలో నయా ఉదారవాద విధానాలు 5) చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలపై బిజెపి దాడి 6) రాజ్యాంగ దినం, అసహనాలపై పార్లమెంటులో చర్చ అన్న అంశాలపై 2015 నవంబరులో పార్లమెంటులో చర్చ సందర్భంగా రాజ్యసభ, లోకసభల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మహమ్మద్ సలీంలు చేసిన ప్రసంగాలు.

ఈ లఘు పుస్తకాలలోని వ్యాసాలలో వుదహరించిన అనేక వుటంకింపులు ప్రధానంగా ఆరెస్సెస్ స్థాపకులు, ప్రత్యేకించి రెండవ సర్‌సంఘ్‌ఛాలక్ అయిన ఎం.ఎస్. గోల్వాల్కర్ రచనల నుండి యిచ్చినవేనన్న విషయాన్ని గుర్తుంచు కోవాలి. ఆరెస్సెస్ చేపట్టే సమకాలీన కార్యకలాపాలకూ ఆ రచనలకు సంబంధమేమిటని

ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఈ రచనలే యిప్పటికీ ఆరెస్సెస్ భావజాలానికి ఆకరంగానూ, దాని ప్రాపంచిక దృక్పథాన్నీ, కార్యాచరణనూ నిర్ధేశించేవిగానూ వున్నాయి. మనము లేదా మన జాతీయతా నిర్వచనము, పాంచజన్యం అన్న గ్రంథాలను గోల్వాల్కర్ రచించి ముప్పాతిక సంవత్సరాల కాలం గడచి వుండవచ్చు. అయినప్పటికీ హిందువుల కోసమే హిందూస్థాన్ అంటూ ప్రస్తుత ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌తో సహా ఆయనకు ముందున్న ఆరెస్సెస్ అధినేతలు చేసిన విషపూరిత వ్యాఖ్యలన్నీ వీటి ఆధారంగానే పుట్టుకు వచ్చాయి. గడచిన యీ అన్ని సంవత్సరాలలో ఆరెస్సెస్‌గానీ, లేదా, దాని రాజకీయ అవతారమైన బిజెపీగానీ ఆరెస్సెస్ స్థాపకులు రూపుదిద్దిన యే ఒక్క సూత్రాన్నయినా తిరస్కరించే సంగతి అలావుంచితే కనీసం వాటినుంచి విడగొట్టుకున్నట్లు చూపించే ఒక్క ప్రకటనగానీ, ప్రచురణగానీ లేనేలేదు. తద్విరుద్ధంగా ప్రస్తుత ప్రధాన మంత్రి తన పుస్తకంలో గోల్వాల్కర్ జీవితాన్ని గురించి రాస్తూ ఆయనను 'కాంతి పుంజం' అనీ, తనకు స్ఫూర్తినిచ్చిన వారిలో ఒకరనీ పేర్కొన్నారు. కనుక యీ లఘు గ్రంథాలలో వుదహరించిన వుటంకింపులు ఆరెస్సెస్ భావజాలాన్ని వివరిస్తాయి. కొన్ని పునరుల్లేఖనాలు వుంటాయి, ఇవన్నీకూడా విదేశీ ఫాసిస్టులైన హిట్లర్ నాజీల నుంచీ, ముసోలినీ బ్లాక్‌షర్ట్‌ల నుంచీ స్ఫూర్తి పొందినవే, ఆరెస్సెస్ 'మౌలికతను'అవగాహన చేసుకోవటానికివి వుపయోగ పడతాయి.

ఆరెస్సెస్ గతాన్ని తవ్వితీయవలసిన అవసరమున్నదా, అనుద్ధేశంగానైనా వాటి ప్రాధాన్యాన్ని యివి హెచ్చించటం లేదా అన్న ప్రశ్నలు తలయెత్తవచ్చు. ఈ లఘు గ్రంథాలలోని పలు వ్యాసాలు తెలియ చెప్తున్నట్లుగా 'అన్యులకు' వ్యతిరేకంగా హింసను ప్రేరేపించేటందుకై ఆరెస్సెస్ అతి హేయమైన పద్ధతులను అనుసరిస్తున్నది. ఇందుకుగాను మత భావనలను వుపయోగించు కోవాలని, అదేవిధంగా యీనాటికీ మన ప్రజలలోని అట్టడుగు తరగతుల వారిని ప్రభావితం చేస్తున్న సామాజిక అసమానతల, లింగ తారతమ్యాల ప్రాతిపదికను కలిగివున్న సంప్రదాయాలను, విశ్వాసాలను వినియోగించు కోవాలని ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ బోధించే హిందుత్వ అనేది వి.డి. సావర్కార్ రూపుదిద్దిన రాజకీయ భావన మాత్రమే. సాధారణ హిందూ విశ్వాసులకిది చాలాదూరం. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వినియోగించు కోవటాన్ని వ్యతిరేకించి పోరాడేవారు తమ పోరాటం యొక్క

లోతుపాతులు తెలుసు కోవలసిన అవసరం ఎంతైనా వున్నది.

వేర్వేరు మత విశ్వాసాలకు చెందిన విభిన్న ఛాందసవాద శక్తులు మతాన్ని రాజకీయాల కోసం వుపయోగ పెట్టుకుంటున్నాయి. ముస్లిం మత ఛాందసవాదులు అంతకంతకూ ముస్లిం యువజనుల్లోకి చొచ్చుకు పోవటం తీవ్రమైన ఆందోళన కల్గిస్తున్నది. ఈ శక్తులను ఏకాకులను చేసి వెనక్కు కొట్టవలసి వుంది.

జాతికి ప్రాతినిధ్యం వహిస్తున్నామంటూ తప్పుడు రీతిలో చెప్పుకునే మెజారిటీ హిందూ ఛాందసవాదులు నుంచి ముస్లిం ఛాందసవాదులు ప్రోత్సాహాన్ని పొందుతున్నారు. పరస్పర విరుద్ధ శక్తులుగా కనిపించే వీరు ఒకర్నొకరు బలపరచుకుంటూ మౌలిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలిస్తున్నారు.

నరేంద్రమోడీ నేతృత్వాన బిజెపీ ప్రభుత్వం కేంద్రంలో తిష్టవేయడంతో, గతంలో అటల్ బిహారీ వాజపేయి హయాంలోవలె అధికార యంత్రాంగానికి ఆరెస్సెస్ దగ్గర కావటమేకాక, వాస్తవంలో ప్రభుత్వాన్ని అదుపుచేసే స్థాయికి చేరింది. మంత్రుల పనితీరు గురించి ఆరెస్సెస్ నాయకులకు నివేదికలను సమర్పించినపుడే అసలైన నాయకులెవరో స్పష్టమైంది. కనుక ఆరెస్సెస్ నిజస్వరూపాన్నీ, ప్రభుత్వంతో దానికున్న సంబంధాలనూ, యీనాడు రాజ్యాంగేతర శక్తిగా అది అధికారాన్ని చెలాయించటం గురించి బహిర్గతం చేయవలసి వుంది.

అంతేకాక నిజానికి నరేంద్ర మోడీ ఒక ప్రచారక్, అంటే, ఆరెస్సెస్ భావజాలానికీ, దాని సిద్ధాంతాలకూ, కార్యచరణకూ కట్టుబడిన పూర్తికాలపు కార్యకర్త. ఒక ప్రచారక్, భారత ప్రధాన మంత్రిగా మారటం ఆరెస్సెస్ పథకంలో పెద్ద ముందడుగు. గుజరాత్-2002, ఆయన నేతృత్వంలో సాగిన హిందూరాష్ట్ర పథకం యొక్క ఫలితం, ఒక ప్రయోగం. దీనికి ఆరెస్సెస్ పూర్తి మద్దతు వున్నది. 2014 లోకసభ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించి పెట్టేదెవరన్న విషయమై 2013-2014లో బిజెపీలో విభేదాలు తలెత్తినపుడు మోడీ అభ్యర్థిత్వానికి ఆరెస్సెస్ వెన్నుదన్నుగా నిలవటమే కాక ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ఎల్.కె. అద్వానీ తదితర సీనియర్ నాయకుల వ్యతిరేకతను రెచ్చకొట్టింది. ఒకప్పుడు ఆరెస్సెస్‌లో తనకు సహచరులూ, యీనాడు బిజెపీ ప్రభుత్వంలో వున్నవారు పదేపదే మతవుద్రికత్తలను రెచ్చగొట్టే చర్యలకూ, ప్రకటనలకూ పాల్పడుతున్నప్పటికీ వారిపై

చర్య తీసుకోవటానికి ప్రధాన మంత్రి నిరాకరణ ఆరెస్సెస్‌పట్ల ఆయనకున్న విధేయతను తెలియచెప్తున్నది. భారతదేశపు ప్రధానమంత్రి ముందుగా ఆరెస్సెస్ కార్యకర్త.

కనుక ఆరెస్సెస్ దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నదో దానికి సంబంధించిన వాస్తవాలు, కార్యకలాపాలు, విశ్లేషణా అందచేయ వలసిన అవసరం వున్నది. లౌకికవాద, ప్రజాస్వామ్య, సమానత్వ సూత్రాలను పరిరక్షించి పటిష్టం చేసేందుకై జరిగే పోరాటంలో యీ లఘు పుస్తకాలు వుపయోగ పడగలవనే మేము ఆశిస్తున్నాము.

ఈ వ్యాసాలను రచించి యిచ్చిన వారికీ, వీటిని వెలికి తీసుకువచ్చేందుకు తోడ్పడిన కామ్రేడ్స్‌కు, పార్టీ మిత్రులకు కేంద్ర ప్రచురణల తరపున మేము కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. వీటి నిమిత్తం వుపయోగించు కోవడానికి అనుమతి యిచ్చిన కార్టూనిస్టులకు కూడా మేము ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము.

**బృందాకరత్**

పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

## చరిత్ర, విజ్ఞాన శాస్త్రం మీద దాడి

**అమర్ ఫరూఖి**

సరస్వతీనది హిందువుల విశ్వాసానికి సంబంధించినది, అని హర్యానా ముఖ్యమంత్రి, అనుభవజ్ఞుడైన ఆర్.ఎస్.ఎస్ ప్రచారక్ ఎం.ఎల్ ఖత్తార్ ప్రకటించారు. (2015 అక్టోబరు 16వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక). హిందువులందరి తరపున మాట్లాడే అధికారం ఆయనకు వుందా లేదా అనే విషయంతోపాటు, ఆ అభిప్రాయాలు నిజంగా హిందువులందరి విశ్వాసాలను ప్రతిబింబిస్తాయా అనే విషయాన్ని ప్రక్కన పెట్టినప్పటికీ, సరస్వతీనది హర్యానా, రాజస్థాన్‌ల గుండా ప్రవహిస్తుండేదని, ప్రస్తుతం వున్న ఘగ్గార్ నది కేవలం ప్రాచీనమైన సరస్వతీనదికి అవశేషం మాత్రమేనని, ఇప్పటికీ సరస్వతీనది అంతర్వాహినిగా ప్రవహిస్తూనే వున్నదని చెప్పడం గమనించదగ్గ విషయం. ఈ వాదనను నిజమని నిరూపించేందుకు అప్రామాణికమైన, మోసపూరితమైన చారిత్రక ఆధారాలను నిర్ధారించేందుకు ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేయడం జరుగుతోంది.

ఉదాహరణకు, హర్యానాలోని యమునా నగర్ జిల్లాలో మొగల్‌వాలీ గ్రామంలో 2015 మే మొదటివారంలో MNREGA (ఉపాధి హామీ పథకం) క్రింద త్రవ్వకాలు జరుపుతుండగా భూగర్భజలాలు బయటపడ్డాయి. పవిత్రమైన సరస్వతీనది అంతర్వాహినిగా ప్రవహిస్తున్నదనేందుకు యిది నిదర్శనమని, వెంటనే ప్రభుత్వాధికారులు ప్రకటించారు. చరిత్రకారులు లేదా పురావస్తు పరిశోధన శాఖ

అభిప్రాయాన్ని తీసుకోవాలని కూడ వారు భావించలేదు. ప్రజల్లో చీలికలు సృష్టించే సంఘ్‌పరివార్ రాజకీయ లక్ష్యాలను నెరవేర్చేందుకు వీలుగా, యీవిధమైన విషయాలను నిర్ధారించడానికనుసరించాల్సిన వృత్తిపరమైన విధివిధానాలను ప్రక్కన పెట్టడం జరిగింది. పవిత్రమైన సరస్వతీనది చారిత్రక మూలాలను నిర్ధారించేందుకుద్దేశించిన రూ50కోట్ల పథకాన్ని హర్యానా ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన రెండువారాల కాలంలోనే యమునానగర్ జిల్లాలో వూహించిన ఫలితాలు సాధించడం జరిగింది. ఈ పవిత్రనదిని "పునరుద్ధరించ"వల్సిందిగా కోరుతూ ప్రముఖ RSS నాయకుడు దర్శన్‌లాల్ జైన్ నాయకత్వంలో 1990 దశకం చివరిభాగం నుండే సరస్వతీనది సోధ్‌స్థాన్ అనే సంస్థ పనిచేస్తున్న విషయాన్ని గమనించాలి.

సంఘ్‌పరివార్‌కు అత్యంత కీలకమైన, పరస్పర సంబంధంగల్గిన రెండు అంశాలు ప్రాధాన్యత కల్గినవిగా వున్నాయి. భారతదేశానికి సంబంధించి అత్యంత పురాతనమైన హరప్పా నాగరికతకు (సింధు (లోయ)నాగరికతగా కూడ పిలవబడుతున్నది) సింధునదితో వున్న సంబంధం, వీరికి మిక్కిలి ఇబ్బంది కల్గించే ప్రథమ అంశం, ఈ నదిలో అత్యధికభాగం పాకిస్తాన్‌లో ప్రవహిస్తూండడంతో, ఉపఖండంలోని, అత్యంత ప్రాచీనమైన పట్టణనాగరికతకు మిక్కిలి ప్రధానమైన ప్రదేశం "శుతృభూభాగం" లోకి పోయింది. అందువలన, సంఘ్‌పరివార్ హరప్పా నాగరికతను సరస్వతీనాగరికత (లేదా సరస్వతీ-సింధునాగరికత)గా లాంఛనంగా తిరిగి నామకరణం చేసేందుకు జోక్యం చేసుకుంటోంది.

భారత, పాకిస్తాన్‌లను 1947లో కృత్రిమంగా విభజిస్తూ రాజకీయ పరంగా సరిహద్దులు నిర్ణయించడం జరిగింది. ఇది ఉపఖండం యొక్క ప్రాచీన చరిత్రను సంబంధించి పూర్తిగా సంబంధంలేని అంశం. హరప్పా ప్రాంతంలోని కొద్ది ప్రాంతాల్లో త్రవ్వకాలు జరిపి, అధ్యయనం చేస్తే, ఆ నాగరికత సింధు, పంజాబ్(తూర్పు, పశ్చిమ), హర్యానా, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లతో సహా చాలా ప్రాంతాలకు విస్తరించిందని స్పష్టమవుతుంది. పశ్చిమ ప్రాంతానికి ఒక చివరలో ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ (ఆగ్జస్ ఆముదర్యా నదీ తీరాన వున్న షార్టు ఘూయ్)లో ఈ నాగరికతను సూచించే

ప్రదేశాలు కనుగొనబడగా, ఈ నివాసాలకు తూర్పు చివరన ఉత్తరప్రదేశ్‌ని సహరాన్‌పూర్ జిల్లాలోని అలంగీర్‌పూర్ వుంది. ఈ విస్తారమైన ప్రాంతాల్లోని వివిధ ప్రదేశాలు విశిష్టమైన విధంగా ఒకే పద్ధతిలో దర్శనమిస్తాయి. అందువలన, పాకిస్తాన్‌లోని పంజాబు రాష్ట్రంలోని, సహీవాల్‌జిల్లాలో వున్న హరప్పా ప్రాంతంలో ప్రప్రధమంగా త్రవ్వకాలు నిర్వహించి, అక్కడి విశిష్ట చారిత్రక లక్షణాలను బట్టి ఒక నాగరికత విలసిల్లిన ప్రాంతంగా గుర్తించి, హరప్పా పేరిట పురావస్తు పరిశోధనా సాంప్రదాయాలకనుగుణంగా పురావస్తు పరిశోధనలో నిష్ణాతులైనవారు యీ ప్రాంతంలో విలసిల్లిన నాగరికతను "హరప్పా నాగరికతగా"గా పేర్కొన్నారు. ఇవే కారణాల వల్ల కొంతమంది దీనిని "సింధునాగరికత" అని కూడ పిలిచారు. భారత వుపఖండంలో అత్యంత అభివృద్ధి చెందిన ప్రాచీన పట్టణనాగరికతకు సంబంధించిన సాక్ష్యాధారాలు 1920 దశకం ప్రారంభంలో సింధు నదీలోయ (ఉదాహరణకు మొహంజదారోలో)లో లభించాయి.

రెండవ అంశం మరింత సంక్లిష్టమైనది. ఎందుకంటె యిది చరిత్రకు సంబంధించిన కాలనిర్ణయాన్ని విధ్వంసం చేస్తుంది. పశ్చిమాన సింధునది నుండి తూర్పున గంగానది వరకు వ్యాపించివున్న సరస్వతీ నాగరికతకు, పవిత్రమైన సరస్వతీనదీ ప్రవాహ మార్గం (ప్రస్తుత హర్యానా) కేంద్రమని నొక్కి చెప్పడం (నిర్ణయాత్మకంగా) జరుగుతోంది. ఘగ్గర్ నదికి సమీపంలో వున్న అనేక హరప్పా త్రవ్వకాలను యిందుకు సాక్ష్యాధారాలుగా చూపడం జరుగుతోంది. నేటి హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని కొన్నిప్రాంతాలు యీ నాగరికతకు కేంద్రమని ధృవీకరించే లక్ష్యంతో సరస్వతీ, యమునా నదుల మధ్య సంబంధాన్ని నెలకొల్పడం జరుగుతోంది. స్వయంగా తనకుతానే సంస్కృత పండితునిగా చెప్పుకున్న, అమెరికాకు చెందిన డేవిడ్ ఫ్రాలీ, దీనికి సంబంధించి అందరినీ నమ్మించే విధంగా ఒక పొందికైన వివరణ యిచ్చాడు. ప్రస్తుత BJP ప్రభుత్వం 2015లో యీయనకు "పద్మభూషణ్" యిచ్చి సత్కరించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రీసెర్చ్ (భారత చరిత్ర పరిశోధనా మండలి) అధ్యక్షుడు, (సంఘ్ పరివార్ లక్ష్యాలను ఏకపక్షంగా సమర్థించే Y. సుదర్శనరావు) ఆ సంస్థకు సంబంధించి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సంస్థ

వ్యవస్థాగత దినోత్సవ ఉపన్యాసం యివ్వవల్సిందిగా డేవిడ్ ఫ్రీలీని ఆహ్వానించారు. ప్రపంచంలోనే ప్రఖ్యాతి చెందిన వృత్తి నిపుణుడైన చరిత్రకారులు ఏమాత్రం, ఏవిధంగానూ ఆమోదించని ఫ్రీలీరచనను BJP అధికారికంగానే కొనియాడుతోంది. తాము చేసే యాపనులకు కనీసం కొద్దిపాటి గౌరవమైనా ఆపాదించుకునేందుకు, వీరికి అమెరికా ఆమోదం కావాలేమో మరి!

**"దేవుళ్ళు, రుషులు, రాజులు :** ప్రాచీన నాగరికతకు సంబంధించిన "వైదిక రహస్యాలు" అనే తన గ్రంథంలో రుగ్వేదంలో పేర్కొనబడిన "నదులన్నింటిలోకి సరస్వతీనది కీలకమైనది, గొప్పది అయినదని", అక్కడి ప్రజల మాతృభూమి సరస్వతీనదీ ప్రాంతమని రుగ్వేదం, వైదిక సాంప్రదాయాలనుండి స్పష్టమవుతోందని" ఫ్రాలీ వక్కాణిస్తున్నాడు. యమునానది ని గురించి వ్రాస్తూ, మొదట్లో ఆనది పశ్చిమ దిక్కుగా ప్రవహించిందని" పేర్కొన్నాడు. గంగానది కూడ సరస్వతీనదికి వుపనదిగా వుండేదనికూడ పశ్చిమంగా సరస్వతీ నదిలోకి ప్రవహించినట్లు కన్పడుతోందని ఆయన పేర్కొన్నాడు. మరోవిధంగా చెప్పాలంటే, బ్రహ్మాండమైన సరస్వతీనదీ తీరాన నివాసముంటున్న వేద సంస్కృతం మాట్లాడే వారే రుగ్వేదాన్ని రచించారన్నమాట! ఫ్రాలీ మరో అడుగు ముందుకేసి "సింధునాగరికత వేదకాలం తర్వాత కాలానికి చెందినది. సింధూనాగరికత అంతమయ్యే నాటికి సరస్వతీనది ప్రవహించడం ఆగిపోయింది." అని పేర్కొన్నాడు. (ఈ కొటేషన్లన్నీ ఫ్రాలీ పుస్తకంలోని రెండవ అధ్యాయంలోని మొదటి భాగం నుండి స్వీకరించడం జరిగింది.) ఆయన వాదన యీవిధంగా కొనసాగింది : సరస్వతీనది యిక ఏమాత్రం పెద్దదిగా లేకపోవడంవల్ల, హరప్పా నాగరికత పతనానంతరం రుగ్వేదం రచించబడినట్లయితే, ఆ పవిత్ర గ్రంథంలో సరస్వతీనదిని గురించి ప్రస్తుతించడానికి తగిన కారణాలు లేవు. హరప్పా నాగరికత అంతమైన తర్వాత, కొద్ది శతాబ్దాలు గడచిన తర్వాత వేదయుగం ప్రారంభమైనదని, వృత్తి నిపుణులైన చరిత్రకారులు కొన్ని దశాబ్దాలు అధ్యయనం చేసిన తర్వాత నిర్ధారించిన చారిత్రక కాలప్రమాణంతో పోల్చితే పూర్తిగా భిన్నంగా ఈ వాదనలు వున్నాయి.

పశుపాలన, వ్యవసాయం వృత్తులుగా గల్గిన సమాజం (రుగ్వేదంలో వివరించిన విధంగా), అభివృద్ధి చెందిన హరప్పానాగరికతను ప్రతిబింబించే విధంగా వుండే పట్టణ సమాజానికి పరివర్తన చెందడానికి, గణనీయమైన సమయం పడుతుంది. అందువలన, రుగ్వేదకాలాన్ని వేలాది సంవత్సరాలు కాకపోయినా కొన్ని సంవత్సరాలపాటు వెనక్కు నెట్టేందుకు తగిన కారణాలను చూపెట్టేందుకు, మోసపూరితమైన పద్ధతిలో తన మేథాశక్తిని వినియోగించాడు.

**“వేదాల ప్రామాణిక కాలం(వేదకాలం) :** పుస్తకరచనా అనే అంశంమీద ప్రభుత్వ నిధులతో ఢిల్లీ యూనివర్సిటీలోని సంస్కృత భాషా విభాగం 2015 సెప్టెంబరులో “జాతీయసెమినార్” ను నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించడం అవసరం. సంస్క ృతభాషా విభాగం అధిపతి కీలకోపన్యాసం చేస్తూ, వేదాలు మార్చబడ్డాయని సర్వసాధారణంగా ఆమోదించబడిన కాలం కంటే షుమారు 5వేల సంత్సరాల కంటె యింకా ప్రాచీనమైనవని ప్రకటించాడు. కొందరు వుపన్యాసములు యీకాలాన్ని మరింత ముందుకు నెట్టి షుమారు క్రీ॥పూ॥ 7500లకు ముందే వేదాలు రచించబడ్డాయని పేర్కొన్నారు. అంటే, చారిత్రకంగా ఆమోదించబడిన కాలం కంటె యింకా షుమారు 6వేల సంవత్సరాల ముందే రుగ్వేదం కూర్పుచేయబడిందన్న మాట! మరో విషయమేమిటంటే, యిది కేవలం విశ్వాసం ప్రాతిపదికన ముందుకు తెచ్చిన వాదనకాదని, ఇది రుగ్వేదంలో పేర్కొనబడిన కొన్ని ఖగోళ సంబంధ విషయాల ప్రాతిపదికగా నిరూపించదగిన, నిర్ధారణలుగా పేర్కొనడం జరిగింది. అసలీ వక్కాణింపు ప్రామాణికమైనది కానేకాదు.

అమెరికాలో వున్న కంప్యూటర్ ఇంజనీర్ సుభాష్ కాక్ 1994లో రుగ్వేద కాలానికి సంబంధించి ఆమోదించబడిన ‘ప్రామాణిక కాలాన్ని’ సవాలు చేస్తూ, ‘ది అస్ట్రనామికర్ కోడ్ ఆఫ్ రుగ్వేదా (రుగ్వేద కాలానికి సంబంధించిన ఖగోళ సూత్రాలు’ అనే గ్రంథాన్ని ప్రచురించాడు. ఆయన ఖగోళ సంబంధమైన సమాచారాన్ని వుదహరిస్తూ (అగ్నికి బలియిచ్చే బలిపీఠంకోసం నిర్మించిన (నిర్దేశించిన) నమూనాలో వేదాల్లో కోడీకరించినట్లు వూహిస్తున్న అంశాల ఆధారంగా) తనలెక్కల ప్రకారం రుగ్వేదకాలం క్రీ॥పూ 4000 నుండి 3000 సంత్సరాలనాటికి చెంది వుంటుందని

వాదించాడు. పై పేర్కొన్న 'జాతీయ సెమినార్' మరింత ముందుకు పోయి, రుగ్వేదకాల నిర్ణయానికి సంబంధించి మరింత వుదారంగా, మరో మూడు వేల నుండి నాలుగువేల సంవత్సరాలు కలిపింది.

చరిత్రకారులు సహజంగానే తరచుగా భిన్నాభిప్రాయాలు కల్గి వుంటారు. ఫలితంగా చరిత్రలో కాల నిర్ణయానికి సంబంధించి విద్వత్‌పరమైన, సైద్ధాంతిక చర్చలు జరుగుతూనే వుంటాయి. అయితే, యీ విధమైన చారిత్రక అంశాల మీద సుదీర్ఘకాలంగా అమలులో వున్న, సాంప్రదాయ సిద్ధమైన పద్ధతిలో చర్చల అనంతరం విశాల ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికీ, ఆ చర్చ కొద్ది వందల సంవత్సరాల (ప్రామాణిక) కాలానికి సంబంధించినదేగాని, వేలాది సంవత్సరాలకు సంబంధించినది మాత్రం కాదు. వీటిని చూస్తుంటే పిరమిడ్లతో పాటు, చిరస్మరణీయమైన ప్రాచీన కట్టడాలను మానవ మాత్రులు గాక, గ్రహాంతర వాసులు నిర్మించి వుంటారని స్విస్ రచయిత ఎరిక్ వాన్ డానికెన్ ప్రఖ్యాత వినోదభరిత రచన 'ఛారియెట్స్ ఆఫ్ గాడ్స్" (దేవుళ్ళ రథాలు) (1968) గుర్తుకు రాకమానదు. అయితే సంఘ్ పరివార్ తలపెట్టిన చర్యలు దురుద్దేశంతో కూడి, తీవ్ర పర్యవసానాలకు దారితీయగలవు. భారతదేశచరిత్రను గురించిన హేతుబద్ధ, చారిత్రకమైన అవగాహనను వ్యాప్తి చేయడంలో నిమగ్నమైన గోవింద్‌పన్సారే, M.M. కల్బుర్గి కర్కశంగా హత్యగావించబడ్డారు. మానవత్వాన్ని మంటగలిపే విధంగా తమ లక్ష్యాల సాధనకు చరిత్రను వినియోగించుకోవడం జరుగుతోంది.

సుదీర్ఘకాలంగా చరిత్ర పరిశోధనల ద్వారా గడించిన జ్ఞానం మీద దాడి 1990 దశకంలో కీలకదశకు చేరింది. అదే సమయంలో సంఘ్‌పరివార్ దౌర్జన్య పూరిత పద్ధతుల్లో రాజకీయ సమీకరణకు పూనుకుంది. అమెరికాలో వున్న వివిధ తరగతుల ప్రవాస భారతీయులు యీ విషయంలో చురుకైన పాత్ర నిర్వహించారు. 1995లో కాక్, డేవిడ్‌ఫ్రాలీతో కలిసి "నాగరికత జన్మస్థానం కోసం అన్వేషణలో" అనే గ్రంథం రచించాడు. "నాగరికతకు భారతదేశమే జన్మస్థానం" వుండేదని నొక్కి వక్కాణించడం ద్వారా మోసపొటేమియా నాగరికత గురించి సుదీర్ఘ కాల పరిశోధనల ద్వారా సేకరించిన విజ్ఞానాన్ని పనికి మాలిన చెత్తగా నిరూపించే ప్రయత్నాలు

సాగుతున్నాయి. చరిత్ర పరిశోధనల ద్వారా పరిశోధనకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడిన పద్ధతుల ముందు ఈ తొందరపాటు సూత్రీకరణలు నిలిచేవికావు.

భారతదేశ ప్రాచీనతను గురించి సరైన దృష్టికోణంలో పరిశీలించాలంటే, ఆహారం వుత్పత్తి చేసే సమాజాలు ప్రప్రథమంగా క్రీ॥పూ॥ 9000 సంవత్సరం ప్రాంతంలో పాలస్తీనాలో ఆవిర్భవించిన విషయాన్ని గమనించవల్సిన అవసరం వుంది. ఆహారవుత్పత్తి చేసే సమాజాలు ఉత్తర ఇరాక్‌కు మొట్టమొదటిసారిగా వ్యాపించడానికి మరో మూడు వేల సంవత్సరాలు పట్టగా, దక్షిణిఇరాక్‌లో పట్టణ ఆవాసాలు ఆవిర్భవించడానికి మరో 2500 సంవత్సరాలు పట్టింది. అంటే షుమారు క్రీ॥పూ॥ 3500సం॥ నాటికి యిది చోటు చేసుకుంది. రెండు, మూడువందల సంవత్సరాల కాలంలోనే అభివృద్ధిచెందిన నాగరికత అయిన సుమేరియన్ నాగరికత దక్షిణ ఇరాక్‌లో వర్ధిల్లుతూనే వుంది. విస్తృతమైన పూరావస్తు పరిశోధనల ద్వారా సేకరించిన సాక్ష్యాధారాల ప్రాతిపదికన ఈ విధమైన కాల నిర్ణయం చేయడం జరిగింది. ప్రస్తుతం అందుబాటులో వున్న అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని, వీటికి సంబంధించిన సమయాన్ని మరింత ఖచ్చితంగా నిర్ణయించవచ్చు. దక్షిణ ఇరాక్ విషయంలో, అర్థం చేసుకోవడానికి వీలైన ఒక ప్రత్యేకతరహా సుమేరియన్ లిపిలో పెద్దసంఖ్యలోని బంకమట్టి పలకలమీద వ్రాత పూర్వకంగా నిక్షిప్తం చేయబడిన సాహిత్య సంబంధమైన విషయాలను, పై సాక్ష్యాధారాలతో కలిపి చూడగలం. పశ్చిమాసియాలో రాతి పనిముట్లతో ఆహారసంపాదన చేసుకునే (క్రొత్తరాతియుగం) సమాజాల నుండి లోహాలు వినియోగించే సమాజాలకు పరివర్తన చెందడానికి షుమారు ఆరువేల సంవత్సరాల కాలం పట్టింది.

భారతఉపఖండంలో ఆహార ఉత్పత్తి (విధానానికి)కి పరివర్తన క్రీస్తు పూర్వం 7000సం॥ల ప్రాంతంలో జరిగింది. బెలూచిస్థాన్‌లో క్రొత్త రాతియుగం అవశేషాలున్న మెహెర్‌ఘర్‌లో యిందుకు సాక్ష్యాధారాలు లభించాయి. వీటితో పాటు, వింధ్యపర్వత పరిసరాల్లో క్రొత్తరాతియుగం ప్రారంభ కాలానికి సంబంధించిన

అవశేషాలు లభించాయి. వాటిలో కొన్ని మెహెర్‌ఘర్‌లో లభించిన అవశేషాలు కాలానికి చెందినవే.

క్రీస్తుపూర్వం 2600 సం॥ ప్రాంతంలో హరప్పా నాగరికత విలసిల్లింది.క్రీస్తు పూర్వం 2500 సం॥ నాటికిదే నాగరికత వుచ్ఛదశకు చేరుకుంది. ఈ వుచ్ఛ దశలో క్రీస్తుపూర్వం 2000సం॥నాటి వరకు కొనసాగిన, యీనాగరికత క్రీస్తు పూర్వం 2000సం॥, 1900సం॥ మధ్యకాలంలో అకస్మాత్తుగా ముగిసిపోయింది. వృత్తి నిపుణులైన అంతర్జాతీయ స్థాయి చరిత్రకారులు అవగాహన చేసుకున్న విధంగా, భారత ఉపఖండానికి సంబంధించి ఆమోదంచబడిన చరిత్ర ప్రకారం, పట్టణాలు అదృశ్యంకావడంతోపాటు, ప్రామాణికమైన ఇటుకల వాడకం వంటి అనేక యితర విశిష్ట లక్షణాలు (ఈ నాగరికతకు సంబంధించినవి) అదృశ్యంకావడం, హరప్పా నాగరికత అంతం కావడాన్ని సూచిస్తుంది. దీని తర్వాత ఉపఖండం యొక్క వాయువ్యప్రాంతంలో మరో చారిత్రక దశ ప్రారంభమైంది. ఈ దశకు సంబంధించి రుగ్వేదం నుండి,పురావస్తు పరిశోధనల నుండి సాక్ష్యాధారాలు లభించాయి. ఈ దశకు వేదకాలానికి పూర్వదశ (క్రీస్తు పూర్వం 1500 నుండి 1000సం॥ వరకు)గా పిలవడం జరిగింది. ఈ దశలో ఈ సమాజంలో కొంత మేరకు వ్యవసాయం సాగుతున్నప్పటికీ, పశుపాలన ప్రధాన వృత్తిగా వుండి పూర్తిగా గ్రామీణ సమాజంగా వుంది. ఈ సమాజంలో ఇతర భాషలు మాట్లాడే ప్రజా సమూహాలు కూడ వున్నప్పటికీ, ఈ సమాజంలో అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు రుగ్వేదభాష అయిన సంస్కృత భాషనే మాట్లాడేవారు.

రుగ్వేదంలో ఎక్కువగా ప్రస్తావించబడిన "గుఱ్ఱం" వేద సంస్కృత భాషను మాట్లాడే ప్రజాసమూహాల "విశిష్టచిహ్నం" గా వుండేది. హరప్పా నాగరికతలో గుఱ్ఱం పెంపుడు జంతువుగా వున్నట్లు ఏ విధమైన ఆధారాలు లేవు. ఇందుకు సాక్ష్యాలు "సృష్టించడానికి" ప్రయత్నాలు జరగడం పెద్ద ఆశ్చర్యకరమైన విషయమేమీకాదు. "డీకోడ్ చేయబడిన సింధులిపి(2000)" అనే రచనలో యీ వాదనలు చేసిన ఎన్.ఎస్ రాజరామ్ వంటి వారికి తీవ్ర భంగపాటు కల్గించే విధంగా, వారి ప్రయత్నాలు పూర్తిగా అప్రతిష్ఠపాలయ్యాయి. ఆ పుస్తకం లోని ఒక వివరణలో

హరప్పాకు చెందిన ఒక సీల్ (ముద్ర) మీద గుఱ్ఱం వున్నట్లు చిత్రించడం జరిగింది. కాని అది మోసపూరితమని  స్పష్టమయింది. ఆ వివరణ కంప్యూటర్‌లో పెద్దది చేసిన చిత్రమని రాజారామ్ తానే ఒప్పుకోవల్సివచ్చింది. గణితశాస్త్రంలో శిక్షణపొంది, అమెరికాలోని నాసా (నేషనల్ ఎయిరో నాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ – NASA) కొంత కాలం ఇంజనీరుగా పనిచేసిన రాజారామ్ డేవిడ్ ఫ్రాలీతో కలిసి 1995లో నాగరికతకు మూలాలు" అనే గ్రంథం రచించాడు.

సాధారణంగా జీవశాస్త్రాలు, గణితశాస్త్రంలో శిక్షణపొంది అమెరికాలో వుంటున్న చరిత్రకారులు కానివారి నుండే చరిత్ర మీద దాడులకు అత్యంత ప్రోత్సాహం లభిస్తోంది.

ఇది అనేక ముఖ్యమైన పురావస్తు పరిశోధనలకు, ప్రపంచంలోని వివిధ సంస్కృతులకు సంబంధించిన వివిధ అంశాలకు సంబంధించిన ఆధారాలను ఒకచోట చేర్చి సరైన నిర్ధారణలకు వచ్చేందుకుద్దేశించినదికాదు.

పశుపాలన, వ్యవసాయం మీద ఆధారపడిన వేదకాలం నాటి ఆర్థికవ్యవస్థ భారతదేశంలోని వాయువ్య, ఉత్తర ప్రాంతాల్లో తన ప్రత్యేక లక్షణాలతో అభివృద్ధి చెందడంతో, ఆహారం ప్రోగుచేసుకోవడం, జంతువులవేట, లేదా ఆహారాన్ని ఉత్పత్తి చేయడం లేదా యీ రెండుపద్ధతుల్లోనూ జీవనోపాధిని సంపాదించుకునే పద్ధతులు ఉపఖండంలోని యితర ప్రాంతాల్లోకూడ అభివృద్ధి చెందడం కొనసాగింది. క్రొత్తరాతియుగం నుండి హాయుగా (లోహాలు వినియోగంలోకి వచ్చిన కాలం) నికి పరివర్తన చెందిన సమయం(కాలం) విషయంలో మధ్య, దక్షిణ, తూర్పు, ఈశాన్య భారతాల్లో కొద్దిగా తేడాలున్నాయి. ఉదాహరణకు, మణిపూర్‌లో నాప్ చిక్ ప్రాంతంలో క్రొత్తరాతి యుగానికి సంబంధించిన ఆవాసాలు షుమారు క్రీ॥పూ॥1700సం॥ నాటికి క్రొత్తరాతియుగం నాటి పనిముట్లు మేఘాలయా (సెల్‌బర్‌గిరి), అస్సాం (సరూతారూ) నాగాలాండ్ లలో జరిపిన త్రవ్వకాల్లో బయటపడ్డాయి. అయితే మరింత విస్తృతంగా త్రవ్వకాలు నిర్వహించి, వీటిని గురించి విస్తృత అధ్యయనాలు సాగించడం జరగలేదు. ఉపఖండానికి సంబంధించిన ప్రాచీన చరిత్రను మరింత సమగ్రంగా అవగాహన చేసుకునేందుకు, వీటికి ప్రాధాన్యత యివ్వవల్సిన అవసరం

వుంది. ఉత్తరభారతం మీద ఎక్కువగా కేంద్రీకరించడంవల్ల యీ ప్రాంతాల్లో (మణిపూర్, మేఘలయా, నాగాల్యాండ్‌లలో) చరిత్ర పరిశోధనకు ప్రభుత్వ మద్దతు లోపించింది. ఫలితంగా చరిత్రకు సంబంధించి మనం అవగాహన చేసుకోవాల్సిన విషయాల మధ్య కొనసాగింపు (గ్యాప్‌లు ఏర్పడి) లోపించింది. BJP ప్రభుత్వ రాజకీయ లక్ష్యాలను గమనంలో వుంచుకుంటే, ఈ గ్యాప్‌లను పూరించవల్సిన అవసరం విస్పష్టంగా కనిపిస్తుంది.

ఉత్తర భారతానికి సంబంధించిన ప్రాచీన చరిత్రను గురించి తలకెక్కించుకున్న అభిప్రాయాలతోపాటు, వేదాలు రచించబడిన కాలానికి సంబంధించిన కాలనిర్ణయం వంటి విషయాలు అంతిమంగా భారతజాతికి "ఆర్యులే ఆద్యులనే" విషయాన్ని నిర్ధారించేందుకేనని వేరుగా చెప్పనవసరం లేదు. మళ్ళీ దీనికి మూలాలు, ఆర్యజాతికి సంబంధించి వలస వాదుల భావనల్లోనే వున్నాయి. పవిత్రమైన వేద కాలానికి చెందిన ఆర్యులే భారత వుపఖండంలో నివసించిన అత్యంత ప్రాచీనులని (మన పూర్వీకులని), వారిని ఉన్నతులుగా పరిగణించాలని, ఆర్యేతరులు కష్టాలు భరిస్తూ బానిసలుగా బ్రతకాలని సంఘ్‌పరివార్ చెప్తోంది. 19వ శతాబ్దంలో వలస సిద్ధాంత కర్తలు ఆర్యులు ఒకజాతి భాషా చరిత్ర శాస్త్రవేత్తలు ఆర్యులను ఒకే భాష మాట్లాడే ప్రజా సమూహంగా భావించి ప్రారంభంలో ఆ మాట వుపయోగించారు. అనే వాదనను ముందుకు తెచ్చారు. జాతులకు సంబంధించి వారు రూపొందించిన ఆధిపత్య పరంపరలో ఆర్యులు అగ్రభాగాన నిలిచారు. ఈ శతాబ్దం చివరి నాటికి ఆలోచనలను మరింత మెరుగుపరిచి, పటిష్టం చేసి, తుది మెరుగులు దిద్ది, దానికొక శాస్త్రీయపరమైన ముసుగును కూడ తగిలించారు. ఒక జాతికి చెందిన వారి ముక్కు ఆకాశం, కొలతలను నమోదు చేసి, వాటి సగటును లెక్కించడంతో సహా అనేక ప్రక్రియలతో కూడిన మానవ శరీరప్రమాణశాస్త్రం (Anthropometry ) వంటి పద్ధతుల ద్వారా ఆర్యుల భౌతిక లక్షణాలతో పాటు, ఇతర జాతుల వారి భౌతిక లక్షణాలను ఖచ్చితంగా నిర్ధారించవచ్చునని గట్టిగా వాదించడం జరిగింది. ఈ విధంగా లెక్కించిన సగటు విలువలను ఆరోపణ/ అవరోహణ క్రమంలో ఏర్పాటు చేస్తే అది, జాతుల ఆధిపత్య పరంపరలో ఆ జాతి

స్థానాన్ని శాస్త్రీయంగానే సూచిస్తుందని భావించడం జరిగింది. ఈ ఆధిపత్య పరంపరలో ఆర్యులు ప్రత్యేకంగా వాయువ్య యూరపుకు చెందిన ఆర్యులు అగ్రభాగాన నిలుస్తారు. ఆర్యుల "జాతి" లక్షణాల్లో ప్రధానమైనవి : చక్కటి శరీర ఛాయ, విశాలమైన నుదుటిభాగం, బాగా కొనదేరిన చిన్న ముక్కు, ఇతరులతో పోల్చుకుంటే పల్చనైన పెదవులు. 1901లో జనాభా లెక్కలకు సంబంధించిన కార్యకలాపాలకు మార్గదర్శకత్వంవహించిన H.H రిస్లే వంటి వలసవాద మానవజాతి శాస్త్రజ్ఞులు (మానవవంశాలను గూర్చిన శాస్త్రీయ వివరణ యిచ్చినవారు) భారతదేశానికి సంబంధించినంత వరకు జాతిని కులంతో ముడిపెట్టారు. అగ్రకులాలవారు సజాతివివాహాలకు ఖచ్చితంగా కట్టుబడి వుండడం వల్ల "ఆర్యజాతి" స్వచ్ఛతను నిలబెట్టుకోగలిగారని భావించడం జరిగింది. ఆర్యజాతి ఔన్నత్యాన్ని గురించి గట్టిగా మాట్లాడడం నాజీ జర్మనీ లో పరాకాష్ఠకు చేరుకుంది. 1933ఏప్రిల్‌లో హిట్లర్ ఒక శాసనంద్వారా ప్రభుత్వోద్యోగ నియామకాల్లో ఆర్యేతరులను మినహాయించాడు. చివరికీ జాత్యంహంకారం వారికి జర్మనీ పేర సత్యం నిరాకరించడంతోపాటు, యూదులు, రష్యన్లు, రుథేనియన్లు, బల్గేరియన్లు, సెర్బియన్లు, క్రొనేషియన్లు తదితరులు, పోలెండు, మారవేనియా, జెకోస్లోవేకియా తదితర దేశాలతోపాటు తూర్పు, ఈశాన్య, మధ్యయుగపు దేశాలకు చెందిన 'శ్లావ్' అనే యూరపు భాషాపరంగానూ అతిపెద్దదైన 'శ్లావ్' జాతి ప్రజల సామూహిక హత్యాకాండను దారి తీసింది. దీనితోపాటు జర్మన్ జాత్యాహకారాన్ని రెచ్చగొడుతూ, చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజల మనసులను మార్చేందుకు విద్వేష పూరిత ప్రచారం సాగించడం జరిగింది. అయితే నేటి భారతదేశంలో ఆ విధమైన తీవ్ర చర్యలు చేపట్టడం సాధ్యంకాదు. అట్టి చర్యలను ప్రజలు కూడ అనుమతించరు. ప్రజల స్మృతిపథం నుండి మన దేశలౌకిక సాంప్రదాయాలను తుడిచిపెట్టి, గతాన్ని గురించి ఒకవిధమైన విద్వేషపూరిత దృక్పథంతో కూడిన భావాలతో నింపడం ద్వారా సంభవించే ప్రమాదాలనుండి దేశ ప్రజలను కాపాడుకోవలస్సిన అవసరం వుంది.

భారతదేశచరిత్రను గురించి చరిత్రతో సంబంధంలేని సంఘ్‌పరివార్

వక్కాణింపులను దేశచరిత్రకు సంబంధించిన “ప్రత్యామ్నాయ నిర్ధారణలు” గా భావించడం పొరపాటు కాగలదు. చారిత్రక సాక్ష్యాధారాల ప్రాతిపదికన యీ వ్యాఖ్యానాలు వ్యర్ధపరమైనవి. ప్రధానంగా దూషణలతో కూడి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవిధంగా, దౌర్జన్యపూరిత భాషలో వేరుచేసి వాదనలు హింసను ప్రేరేపించే వుద్దేశ్యంతో చేస్తున్నవే. ఈ విధంగా ప్రభుత్వ ప్రత్యక్ష మద్దత్తుతో చరిత్రమీద పెద్దఎత్తున సాగుతున్న ఈ దాడిని ప్రతిఘటించడం, ప్రజలను రాజకీయంగా సమీకరించడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.

*

# ప్రాచీన విజ్ఞాన శాస్త్రం - హిందుత్వ

**ప్రబీర్ పురకాయస్థ**

ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను అభివృద్ధి చేయాలని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో నిర్దేశించడం జరిగింది. పౌరులు తమ ప్రాధమిక కర్తవ్యాల్లో భాగంగా "శాస్త్రీయ ఆలోచనలను, మానవత్వాన్ని (మానవతావాదాన్ని), ప్రశ్నించేతత్వాన్ని, సంస్కరణ స్వభావాన్ని అభివృద్ధి చేయలని" భారతరాజ్యాంగంలోని 51A (h) అధికరణం నిర్దేశిస్తోంది.

నానాటికి పెరుగుతున్న అసహనం, అసమ్మతిని అణచివేసే పరిస్థితులకు వ్యతిరేకంగా నిరసన గళమెత్తుతున్న మేధావుల సంఖ్య నానాటికి పెరుగుతుంది. ఇటీవల దేశంలోని మరో 107 మంది ప్రముఖ శాస్త్ర వేత్తలు వీరితో చేతులు కలిపారు. భారతరాజ్యంగంలోని ఆదేశిక సూత్రాలకు భిన్నంగా "ప్రభుత్వంలోని ప్రధాన కార్యనిర్వాహకులే హేతువిరుద్ధమైన, దురభిమానపూరిత భావాలను ప్రోత్సహించడం మనం చూస్తున్నాం". అవి వీరు తమ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్.ఎస్.ఎస్ దాని అనుచరులు తాము భావించే ఆర్య భారతం యొక్క గొప్పదనాన్ని గురించి, గొప్పగా చెప్పే ఆతురతలో, విజ్ఞాన శాస్త్రంలో వేదాలే అంతిమమని, పురాణాల్లో చేసిన కల్పనలను ఆధారంచేసుకుని, చారిత్రక వాస్తవాలుగా చిత్రించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక క్రొత్తగా పరిశోధించి కనుగొనవల్సిన విషయాలు ఏమీలేవని, వాటిన్నింటిని గతంలోనే మన రుషులు

కనుగొన్నారని చేస్తున్న మోసపూరిత వాదనల మీదనే పూర్తిగా ఆధారపడుతున్నారు. ఇది విజ్ఞానశాస్త్రం గురించి బాత్రా కథనం.

ఆర్.ఎస్.ఎస్ సృష్టించిన "ఇతిహాస్ బచావో ఆందోళన (ఇతిహాసాలను రక్షించాలని కోరే వుద్యమం)" అనే సంస్థను దీనానాథ్ బాత్రా నిర్వహిస్తున్నారు. గుజరాత్ పాఠ్యప్రణాళికలో భాగమైన "తేజోమయ్‌భారతం (ప్రకాశవంతమైన భారతం)"లో ఆయన ఈ విధంగా వ్రాశారు. "మానవ శరీరంలోని కణనిర్మాణంలో అత్యంత ముఖ్యమైన స్టెమ్‌సెల్స్ (మూలకణాలు)ను కనుగొన్న పరిశోధనలకు సంబంధించిన ఖ్యాతిని తన ఖాతాలలో వేసుకోవాలని అమెరికా కోరుకుంటోందని, అయితే వాస్తవానికి డా॥ బాలక్రిష్ణ గణపత్ మాతాపుర్కార్, శరీరంలోని వివిధ అవయవాల పునరుత్పత్తికి సంబంధించిన పేటెంట్‌ను యిప్పటికే పొందివున్నారు. ఈ పరిశోధనలు ఏ మాత్రం క్రొత్త కాదంటే మీకు ఆశ్చర్యం కలుగవచ్చు. డా॥ మాతాపుర్కార్ మహాభారతం (92-93 పేజీలు) నుండి ప్రేరణ పొందాడు. గాంధారి గర్భంలోని ఒక్కఅండం నుండి 100మంది కౌరవులు జననం, ప్రాచీన భారతంలో స్టెమ్‌సెల్ పరిశోధనకు ఒక ఉదాహరణేగాని, కేవలం కల్పిత గాథకాదు" అని ఆయన వ్రాశాడు. మహాభారతకాలంలోనే టెలివిజన్లు వున్నాయని కూడ ఆయన తన పుస్తకాల్లో పేర్కొన్నాడు. మహాభారత యుద్ధానికి సంబంధించిన వివరాలను దూరం నుండే ధృతరాష్ట్రునికి వివరించడాన్ని చూస్తే, ఆనాడే టెలివిజన్లు వున్నాయని చెప్పడానికి వుదాహరణగా ఆయన పరిగణించాడు. భారతీయ పురాణాల్లో గణేశునికి ఏనుగు తలను అమర్చడానికి కాస్మెటిక్ (సౌందర్య సాధక) శస్త్ర చికిత్సగా పరిగణించాలని కూడ ఆయన పేర్కొన్నాడు.

సైన్సుకు సంబంధించి బాత్రా దృక్పథాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడి కూడ బలపర్చాడు. గత ఏడాది ప్రసంగిస్తూ ప్రాచీన భారతదేశంలోనే జన్యుశాస్త్రం, అవయవమార్పిడి అందుబాటులో వుండేవని పేర్కొన్నాడు. "మన దేశానికి యీ శక్తి సామర్థ్యాలున్నాయని చెప్పడమే నా వుద్దేశ్యం. వీటిని తిరిగి సాధించవల్సిన అవసరం వుంది." అని ఆయన అన్నారు.

సైన్సుతో పనిలేదు. సంస్కృతం చదువుకోండి. ఇంకా ప్రగతి సాధించనవసరం లేదు. "ప్రాచీన" విజ్ఞానాన్ని తిరిగి సంపాదించుకుంటే సరిపోతుంది. మోడి హయాంలో సైన్సుకు బడ్జెటు కేటాయింపుల్లో నిరంతరం కోత విధించడం ఆశ్చర్యకరమైన విషయం కాదు.

సైన్సు నుండి ప్రాచీన భారత చరిత్ర వరకు అన్ని విషయాలను అధికారికంగా ప్రకటించడం బి.జె.పి కుట్రపూరిత ప్రణాళికలో భాగం కావడం అంత ఆశ్చర్యకరమైన విషయం కాదు. ప్రాచీన భారత విజ్ఞానశాస్త్రం మీద నిర్వహించబడిన భారతసైన్స్ కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా, ముంబై విశ్వవిద్యాలయంలోని సంస్కృతం విభాగం ప్రాచీన భారత విజ్ఞాన శాస్త్రం మీద ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి, రుగ్వేదం 5వేల నుండి 10వేల సంవత్సరాల ప్రాచీనమైనదని, ఆర్యులు భారతదేశానికి వలస వచ్చిన వారు కాదని ప్రకటించింది.

"సాక్ష్యాధారాల" స్థానంలో "విశ్వాసాల"ను నిలబెట్టి, వాటిని హిందూత్వ హిందూమతోన్మాధ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. అప్పుడు విశ్వాసాలమీద ఆధారపడి పురాణాలు, కాల్పనిక గాథలు "నిజమైన" చరిత్ర అయిపోతాయి. కేవలం వేదాలు, రామాయణ, మహాభారతాలనే ప్రామాణిక సాక్ష్యాలుగా వుపయోగించాలని, వీటిలో విబేధించే ఏవిధమైన భాషాశాస్త్రం, పురావస్తుపరిశోధనా ఫలితాలు, ఇతర మూలగ్రంథాలను పరిగణనలోకి తీసుకోనవసరంలేదని, భారత చరిత్ర పరిశోధనామండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రిసెర్చి – ICHR) ప్రస్తుత అధిపతి, వై.ఎస్.రావు ప్రబోధిస్తున్నాడు. ఉదాహరణకు, కార్బన్ ఐసోటోపు సహాయంతో మానవుడు నిర్మించిన వస్తువుల కాలాన్ని నిర్ణయించే విధానం ద్వారా శాస్త్రీయంగా వేదకాలాన్ని 3500సం॥ ముందు కాలంగా నిర్ణయించగా, ఈ ప్రమాణాన్ని త్రోచిపుచ్చి, మౌఖిక (ఆనోట యీనోట చెప్పుకున్న) సాంప్రదాయం ప్రకారం వేదకాలాన్ని 10వేల నుండి 20వేల సంవత్సరాల పురాతనమైనదిగా చెప్పడం జరిగింది.

చరిత్రను శాస్త్రీయంగా అవగాహన చేసుకోవడానికి, సాక్ష్యాధారాల

ప్రాతిపదిక తన పరిశోధనలు చేసి, ప్రజలు ఏవిధంగా జీవనం సాగించిందో, సమాజం ఏవిధంగా అభివృద్ధి చెందిందీ అనే అంశాల గురించి ఒక పొందికైన విధంగా చరిత్రను రూపొందించాలి. మౌఖికమైన లేదా వ్రాత పూర్వకమైన అంశాలను యితర సాక్ష్యాధారాల ద్వారా ప్రామాణికం చేయవల్సి వుంటుంది. ఇతర శాస్త్రాల వలెనే చరిత్ర కూడ శాస్త్రీయమైన పరిశీలన, విచారణలకు సంబంధించిన సానుకూల, ప్రతికూల పరిణామాలను విమర్శనాత్మకంగా పరిశీలించడమే. ఇది దీనానాథ్ బత్రా లేదా వై.ఎస్. రావులకు గిట్టదు. వారి దృష్టిలో తమ విశ్వాసాలను ధృవీకరించకపోయినట్లయితే హేతుబద్ధతకు అర్థమే లేదు. ఈ విశ్వాసాలు కూడ ప్రాచీన హిందూమత ప్రభావాన్ని కీర్తించడానికి మాత్రమే.

కాల్పనితకు వాస్తవికత ముసుగు వేసే యీ దృష్టికోణం కేవలం చరిత్రకేగాక, సైన్సు, గణితాలకుకూడ నష్టం వాటిల్లజేస్తుంది. ఇది సైన్స్, గణితం, చరిత్రలను సహితం ధ్వంసం చేస్తుంది. కొత్త ఆవిష్కణలను మన శాస్త్రజ్ఞులు కనుగొన్నట్టుగా కాక కేవలం సంస్కృతం చదువుకుని అందులో ఉన్నవాటినే తిరిగి ఆవిష్కరించినట్టువుతుంది.

**భారతీయ శాస్త్రవిజ్ఞానం వాస్తవ చరిత్ర :**

ఖగోళశాస్త్రం, గణితం, తర్క (న్యాయ)శాస్త్రం, వైద్యం మరియు భాషలకు సంబంధించి ప్రాచీన భారతం ఎంతటి ప్రగతి సాధించిందో నిరూపించేందుకు అనేక సాక్ష్యాధారాలున్నాయి. లోహశాస్త్రం (మెటలర్జీ) లో బ్రహ్మాండమైన ప్రగతి సాధించి, ఉక్కుగా ప్రసిద్ధిగాంచిన గట్టి ఇనుమును తయారు చేయడం జరిగింది. ఇది యూరపులో డమాస్కస్ స్టీల్‌గా ప్రసిద్ధిగాంచిన గట్టి ఇనుము(స్టీల్) కంటె శ్రేష్ఠమైనది.

గణితశాస్త్రంలో యితర అంకెలవలెనే 'సున్నా' ను వుపయోగంలోకి తేవడం గణితశాస్త్రానికి, భారతీయ గణితశాస్త్రం విశేషసేవలందించింది. క్రీ॥శ. 476సం॥లో జన్మించిన ఆర్యభట్టు స్థానానికి విలువయిచ్చే పద్ధతి (place value Notation ఒక సంఖ్యలోని అంకె వున్న స్థానానికి విలువ యిచ్చే పద్ధతి. ఉదాహరణకు ఒక సంఖ్యలో

ఒకట్ల స్థానం, పదుల స్థానం, వందలస్థానం వగైరా) ని స్పష్టమైన విధంగా సూత్రీకరించాడు.” “స్థానం స్థానం దశగుణం” అంటే ఒక స్థానంలో వున్న అంకెను పదితో గుణిస్తే తర్వాత స్థానం వస్తుంది. ఇప్పుడు పాకిస్థాన్‌లో వున్న పెషావర్‌కు సమీపంలోని భక్షాలీలో లభించిన భూర్జపత్రాలు (ఒక రకమైన కొండ రావి చెట్టు బెరడు) మీద వ్రాయబడిన భక్షాలీవ్రాతప్రతిలో వున్న విజ్ఞానాన్ని పరిశీలించినట్లయితే, అది క్రీ॥శ. 2నుండి4వ శతాబ్దం మధ్య కాలానికి చెంది వుంటాయని భావించడం జరుగుతోంది. అయితే, అసలు ప్రతి అంతకు ముందు నాటి పాత ప్రతులకు నకలుగా పరిగణించడం జరుగుతోంది. ఇది ఒక సంఖ్యలో అంకె కున్న స్థానం యొక్క విలువను సూచిస్తుంది.

ఆర్యభట్టు కన్నా చిన్నవాడైన ఆయన సమకాలికుడైన వరాహమిహిరుడు “సున్నా” ను గణిత సంబంధమైన లెక్కల్లో మొట్టమొదటసారి వుపయోగించాడు. అయినప్పటికి “సున్నా” ను గణితంలో వుపయోగించుకునేందుకు సంబంధించిన నిబంధనలు రూపొందించిన బ్రహ్మగుప్తునికి మనం రుణపడి వున్నాం. సున్నాతో కూడికలు, తీసివేతలు, హెచ్చవేతల(గుణింతం) కు సంబంధించిన నిబంధనలను ఆయన సరిగ్గా రూపొందించినప్పటికీ, సున్నాతో భాగించడం విషయంలో ఆయన ఇబ్బందుల నెదుర్కొన్నాడు. అసలు భాగహారాన్ని రద్దుచేయడం ద్వారా, ఆధునిక గణితశాస్త్రం ఈ సమస్యను పరిష్కరించింది. అంకెలను సంబంధించి నేడు మనం వినియోగిస్తున్న చిహ్న (గుర్తు)లను భారతదేశమే అందించడం చాలా ఆసక్తికరమైన విషయం. బ్రాహ్మలిపిలో వుపయోగించిన అంకెల నుండే వీటిని గ్రహించడం జరిగింది. జైన గణితంలో ప్రధాన ప్రతులను రూపొందించిన ప్రాకృత భాషలో బ్రాహ్మిలిపిని విస్తృతంగా వుపయోగించడం జరిగింది. యూరపు, ఆంగ్లో–అమెరికన్ విలువలు, అనుభవాల ప్రాతిపదికగా (యూరోసెంట్రిక్) చేసిన నూతన ఆవిష్కరణలకు సంబంధించిన కథనాల్లో భారతదేశంలోని సమాజాల పాత్రను పరిశీలించిన విధంగానే, ఇతర సమాజాల పాత్రను తక్కువచేసి చూపడం జరిగింది.

## పైథాగరస్ సిద్ధాంతం :

ఈ సిద్ధాంతాన్ని పైథాగరస్ అనే గ్రీకు గణిత శాస్త్రజ్ఞుడు కనిపెట్టాడు.

మిక్కిలి ప్రసిద్ధి పొందిన రూపంలో యీ సిద్ధాంతం ప్రకారం, ఒక లంబకోణత్రిభుజంలో కర్ణం (లంబ కోణానికి ఎదురుగా వున్న భుజం) మీద చదరం, మిగిలిన రెండు భుజాలమీది చదరాల మొత్తానికి సమానం. వేర్వేరు పద్ధతుల్లోనైనప్పటికీ ఇతర సమాజాల్లో కూడ ఈ అవగాహన తెలిసినదే. అయితే ఇవి భారతదేశంలో వేదాలకు అనుబంధాలుగా భావించబడుతున్న శృతసూత్రాల్లో భాగమైన సుల్బ సూత్రాల్లో (కొలతలకు సంబంధించిన వివరాలు భాగంగా వున్నాయి. ఈ సుల్బ సూత్రాలు), మతపరమైన కార్యకలాపాలకు అవసరమైన బలిపీఠాలు లేదా హోమగుండాలు లేదా వేదికలను వివిధ రకాలుగా ఏవిధంగా తయారుచేయాలో వివరిస్తాయి. వీటిలో ప్రధానమైన బౌధాయన సులభసూత్రాలు క్రీ॥పూ॥ 700 నుండి 800 సం॥ల మధ్యకాలంలోనూ, క్రీ॥పూ॥ 600సం॥ ప్రాంతంలో ఆపస్తంబ, క్రీ॥పూ 750 ప్రాంతంలో 750 మానవ, క్రీ॥పూ॥ 200ప్రాంతంలో కాత్యాయన సులభసూత్రాలు సంకలనం చేయబడ్డాయి.

సులభ సూత్రాలు త్రిభుజాలకు బదులుగా దీర్ఘచతురస్రాన్ని వుపయోగించి, ఈ సిద్ధాంతానికి ఒక భిన్నమైన సూత్రీకరణ చేయడం జరిగింది. ఒక లంబకోణం త్రిభుజంలోని మూడుభుజాల మధ్య రేఖాగణిత సంబంధం గ్రంథకర్తలకు తెలుసుననే విషయం మూలగ్రంథాల నుండి స్పష్టమవుతుంది. దీనికనుగుణంగానే వున్న పైథాగరియన్ ట్రిప్లెట్స్‌గా పేర్కొన్నబడ్తున్న "సెట్ ఆఫ్ నంబర్స్" కూడా వారికి తెలుసు.

పైథాగరస్ సిద్ధాంతం కేవలం భారత్, గ్రీస్‌లలోనే గాక బాబిలోన్, చైనా, ఈజిప్టుల్లో కూడ తెలిసివుండడమే గాక, ఈ దేశాల్లో భూములుకొలిచేందుకు, మతపరమైన కట్టడాలను నిర్మించేందుకు (ఈజిప్టులో పిరమిడ్లు, భారతదేశంలో హోమగుండం నిర్మాణానికి), కాల్వల నిర్మాణానికి (బాబిలోన్‌లోవలె) వుపయోగించడం జరుగుతుండేది. సులభ సూత్రాల సంకలనానికి ముందుగానే కీ॥పూ 1800వ సంవత్సరానికి ముందే విద్యార్థులకు బోధించేందుకు "బాబిలోనియన్ టాబ్లెట్" లను వుపయోగించేవారు. వారికి పైథాగరేనియన్ ట్రిప్లెట్లు, పైథాగరస్ సిద్ధాంతం గురించి తెలిసినట్లు స్పష్టమవుతుంది. ఈజిప్టు, బాబిలోన్

దేశాలు సరుకులు, విజ్ఞానం, మూలగ్రంథాలను పరస్పరం మార్పిడి చేసుకోవడం సర్వ సాధారణమైన విషయంగా వుండేది. ఈజిప్టు స్వతంత్రంగానూ, బాబిలోన్ ద్వారాను పైథాగరస్ సిద్ధాంతానికి సంబంధించిన విజ్ఞానాన్ని సమకూర్చుకుంది. పైథాగరస్ తన జీవితంలోని తొలిరోజుల్లో గణనీయమైన కాలాన్ని ఈజిప్టులో గడిపి, ఈజిప్షియన్ల నుండి గణితశాస్త్రం నేర్చుకున్నట్లు కూడ తెలుస్తోంది. చైనాలో కూడ పైథాగరస్ సిద్ధాంతం గురించి బాగా తెలుసు. చైనాలో పైథాగరస్ సిద్ధాంతాన్ని కోయూ-క్యూ (kou-ku) సిద్ధాంతంగా వ్యవహరిస్తుండేవారు.

వివిధ సంస్కృతులకు ఆలవాలమైన అనేక ప్రాంతాల్లో పైథాగరస్ సిద్ధాంతం ప్రాశస్త్యం పొందినట్లు పండిత ప్రకాండులు సైతం అంగీకరించారు. వివిధ సమాజాలు కొన్ని సందర్భాలలో విజ్ఞానం పరస్పరం మార్పిడి చేసుకోవడం ద్వారానూ, మరికొన్ని సందర్భాల్లో స్వతంత్రగానూ, ఒకే సమయంలో ఒకే విధమైన నూతన ఆవిష్కరణలను చేసిన విషయాన్ని యిక్కడ గమనించవలసివుంది. ప్రాచీన భారతంలో శాస్త్రజ్ఞులు చేసిన నూతన ఆవిష్కరణల (పరిశోధించి కనుగొన్న విషయాల) పట్ల గర్వపడవల్సిందే. అయితే అదే సమయంలో మొత్తం విజ్ఞానానికి కేవలం భారతదేశం ఒక్కటే భాండాగారం వంటిదనే సిద్ధాంతాలను సృష్టించడం, యిక మనం చేయవల్సిందల్లా వేదగణితం శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన యితర అంశాలను బోధించడం మాత్రమేనని గొప్పలు పోవడం, ప్రాచీన భారతంలో శాస్త్రజ్ఞుల విశిష్ట కృషికి చిహ్నంగా నిల్చిన మార్పులకు, శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన నూతన అంశాలను ఆవిష్కరించే స్ఫూర్తి, చైతన్యాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది.

**వేదగణితం – విజ్ఞాన సముపార్జనా స్ఫూర్తి :**

పూరీ శంకరాచార్య స్వామి భారతీకృష్ణ తీర్థ జీ వేదగణితం పేరిట అనేక వాదనలు ముందుకు తెచ్చాడు బొంబాయి IITలో గణితశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చి (CSIR) సంస్థ, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగంలో విశిష్ట పరిశోధనలు చేసిన వారికి ప్రతిఏడాది అందించే శాంతి స్వరూప్ భట్నగర్ అవార్డును గణితశాస్త్రంలో 1990 సంవత్సరంలో అందుకున్న

గణితశాస్త్రవేత్త, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని (NBHM) ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించినవాడు, 2007లో థర్డ్‌వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్. శ్రీకృష్ణగోపాలరావు ప్రొఫెసర్ డానీ తదితరులు వేదగణితానికి, ప్రాచీన గణితశాస్త్రానికి, వేదాలకు ఏవిధమైన సంబంధంలేదని నిరూపించారు. అంతేగాక నేటి కాలిక్యులేటర్లు, కంప్యూటర్లు యుగంలో వీటికి ప్రాధాన్యత లేదు. వేదగణితానికి పురాతనత్వాన్ని ఆపాదించినప్పటికీ, వేదాలకు సంబంధించి ప్రస్తుతం అందుబాటులో వున్న సాహిత్యంలో అథర్వణ వేదానికి సంబంధించిన మూలగ్రంథంలో యీ అంశాలు లేవు.

హిందూత్వ లాబీకి సంబంధించినంతవరకు, కల్పనతో కూడిన గతమే యావత్ విజ్ఞానానికి భాండాగారం వంటిదని, ప్రస్తుతం మనకు తెలిసిన (అందుబాటులో వున్న) చరిత్ర అంతా, కోల్పోయిన యీ విజ్ఞానాన్ని తిరిగి రాబట్టడం మాత్రమే. నిరంతరం సాగుతున్న పరిణామాలపరంపరే వాస్తవ చరిత్ర. "సులభ సూత్రాల"కు సంబంధించిన నాలుగు కథనాలు ఒకే విధంగా లేవు. విధానాలస్పష్టమైన అభివృద్ధి, ఖచ్చితమైన ఫలితాలు, సమయాన్ని బట్టి సైద్ధాంతిక సూత్రీకరణలను యివి సూచిస్తాయి. అదేవిధంగా పది అంకె ప్రాతిపదికగా ఒక సంఖ్యలోని అంకె స్థానాన్ని బట్టి విలువ యిచ్చే పద్ధతి (Place value Notation) నుండి, విలువనిచ్చే విధంగా సున్నాను వుపయోగించడం, చివరకు వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు సున్నాను ఒక సంఖ్యగా పరిగణించే స్థాయికి గణితశాస్త్రం అభివృద్ధి సాధించింది.

సైన్సు, గణితశాస్త్రాల చరిత్ర అంటే ఎవరు దేనిని ముందుగా కనిపెట్టారనేది కాక, విశాలప్రాతిపదికన వువ్వెత్తున సాగిన అభివృద్ధి, దానిలో ఏఏ సాంస్కృతికప్రాంతాలు ఏమేరకు భాగస్వామ్యం వహించిందీ, పైథాగరస్ సిద్ధాంతం, సంఖ్యాసిద్ధాంతం అభివృద్ధి స్పష్టం చేస్తున్నాయి. ఏదైనా నిర్దిష్ట సాంస్కృతిక ప్రాంతానికి చెందిన సాంస్కృతిక జాత్యంహంకారుల వాదనలకు యిది పూర్తిగా భిన్నమైనది.

**చరిత్ర గురించి హిందూత్వ జాత్యహంకారుల దృక్పథంతో తారతమ్యాలు :**

నేడు హిందూత్వ ప్రచారకులు సాగిస్తున్న ప్రచారానికి భిన్నంగా, ఆనాడే విదేశాలనుండి విజ్ఞానాన్ని స్వీకరించిన విషయాన్ని అంగీకరించడంలో భారతీయ విజ్ఞానశాస్త్రం ఏమాత్రం సంకోచించలేదు. క్రీ॥పూ 6వ శతాబ్దంలో వరాహమిహిరుడు ఖగోళశాస్త్ర విజ్ఞానాన్ని సంకలనం చేసి రూపొందించిన "ప్రపంచసైద్ధాంతిక" (ఖగోళశాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన 5సూత్రాలను వివరించే గ్రంథం), గ్రంథంలోని "పౌలిసా" (ఈ గ్రంథానికి మూలాలు గ్రీసులో, బహుశ అలెగ్జాండ్రియాలో వుండి వుండవచ్చును.) రోమక (దీని మూలాలు రోమే లేదా గ్రీసులో వుండి వుండవచ్చును) లను విదేశాలనుండి స్వీకరించినట్లు పేర్కొన్నాడు. అదేవిధంగా ప్రాచీన కాలం నాటి ఖగోళశాస్త్రం, గణితశాస్త్రాలకు సంబంధించిన విజ్ఞానం మీద బాబిలోన్ ప్రభావం వున్నట్లు కన్పడుతుంది.

ఆ తర్వాత మధ్య యుగాల్లో అరబ్బులు భారతీయ గణిత శాస్త్రాన్ని, ఖగోళశాస్త్రాన్ని, వైద్యం విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలను పశ్చిమాసియాకు తీసుకుని వెళ్ళాడు. ప్రాచీన భారతంలోని మనశాస్త్రజ్ఞులవలెనే, ఆరబ్ దేశాల్లోని శాస్త్ర వేత్తలుకూడ లామా విజ్ఞానాన్ని ఏ దేశం నుండి గ్రహించింది వెల్లడించడానికి సంకోచించలేదు. క్రీ॥పూ 8వ శతాబ్దంలో పశ్చిమాసియాలో ఫజారి ఖగోళశాస్త్రంలో భారతీయ విధానాలను ప్రవేశపెట్టాడు. ఈయన బంద్ హింద్ (భారతీయ ఖగోళశాస్త్ర విధానాలు) అనే గ్రంథంలోని బ్రహ్మగుప్తుని బ్రహ్మస్ఫుట సిద్ధాంతానికి సంబంధించిన విజ్ఞానాన్ని సంకలనం చేశాడు. భారతీయ సంఖ్యాశాస్త్రం మీద "కితాబ్ ఆల్ - గామ్?" "వా - ఆల్ - తాఫ్రిక్‌బీ-;" "ఇసాబల్ - హింద్" పేరిట అల్‌ఖ్వార్జ్మీ (9వ శతాబ్ధం ప్రారంభంలో బాగ్దాద్‌లోని హౌస్ ఆఫ్ విజ్‌డమ్‌లో సభ్యుడయ్యాడు. వివిధ రంగాలు, సంస్కృతులకు సంబంధించిన సమాచారాన్ని, ఆలోచనలను పంచుకునేందుకు ఏర్పాటుచేయబడిన విద్యా, పరిశోధనా సంస్థ హౌస్ ఆఫ్ విజడమ్) దీనిలో యూదు, క్రైస్తవ మత నేపథ్యం కల్గిన వారితో సహా అనేకమంది ప్రసిద్ధిచెందిన పండితులు దీనిలో భాగస్వాములు) ఒక ప్రమాణిక గ్రంథాన్ని

రచించాడు. దీనిని అల్‌గోరిత్మ డి నూమెరో ఇండోరమ్ (అల్ – ఖ్వారిజ్మి ఆన్ ది హిందూ ఆర్ట్ ఆఫ్ రికనింగ్) (లెక్కలు వేయడంలో హిందువుల కౌశలం) పేరిట లాటిన్ భాషలోకి తర్జుమా చేయడం జరిగింది. "లిబర్ అబాకీ" (బుక్ ఆఫ్ కాలిక్యులేషన్స్) అనే పుస్తకం ద్వారా భారతీయ సంఖ్యా శాస్త్రాన్ని వియోనార్డో ఆఫ్ పీసా యూరపు అంతటా వ్యాప్తిలోకి తెచ్చాడు.

మధ్యయుగాల్లో భారత సాంకేతిక పరిజ్ఞానం పెద్దఎత్తున అభివృద్ధి సాధించింది. హిందూత్వ జాత్యహంకార ఆలోచనా విధానం యీ ప్రగతిని ప్రక్కన పెట్టింది. మధ్య ఆసియా, పశ్చిమాసియాల మధ్య పరస్పర సంబంధాల వల్ల భారతదేశంలోకి అనేక నూతన విధాలైన శిల్పకళ, ఇంద్రధనుస్సు ఆకారంలో ఆర్చీలు (తోరణాలు), గోపురాలు నిర్మించే శక్తి, సామర్థ్యాలను సంతరించుకోవడంతోపాటు, కాగితం వినియోగాన్ని వ్యాప్తిచేయడం, కుట్టిన దుస్తులు ధరించడం, లోహాలు తాపడం (పొదగడం) చేయడం, లోతైన బావుల నుండి నీటిని తోడి వ్యవసాయం చేసేందుకు పర్షియన్ చక్రాలను వుపయోగించడం, ప్రత్తి వస్త్రాల నేతకు నూతన రకాలైన మగ్గాలను తీసుకురావడం వంటి అనేక పరిణామాలు సంభవించాయి.

**వైమానిక శాస్త్రం, రాకెట్ తయారీ రంగాల్లో భారత ప్రతిభ :**

హైదర్ అలి, టిప్పు సుల్తాన్‌లు రాకెట్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడంలో పథ నిర్దేశకులుగా నిలిచారు. మైసూరు రాజులకు, ఆంగ్లేయులకు మధ్య జరిగిన యుద్ధాల్లో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా సమర్థవంతంగా రాకెట్లను ప్రయోగించడం జరిగింది. భారతదేశంలో వైమానిక రంగంలో కృషిచేసిన ఆద్యుల్లో ఒకరైన రొద్దం నరసింహ, 1985లో తాను ప్రచురించిన పత్రంలో రాకెట్ తయారీ రంగానికి టిప్పుసుల్తాన్, హైదర్ ఆలీలు చేసిన సేవలను గురించి చర్చించాడు. ప్రస్తుత ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖా మంత్రి మహేష్‌శర్మ చేత "ముస్లిం అయినప్పటికీ జాతీయవాది"గా పేర్కొనబడిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ తన ఆత్మకథలో "రాకెట్ తయారీ రంగానికి" టిప్పుసుల్తాన్, హైదర్ ఆలీలు చేసిన సేవలకు వున్నతమైన ప్రశంసలందించారు.

11వ శతాబ్ధంలో చైనాలో  తుపాకి మందు, రాకెట్ తయారీకి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని కనుగొన్న విషయంతో పాటు, భారతదేశంతో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వారేవిధంగా పయనించిందీ రొడ్డం నరశింహ ఆ పత్రంలో చర్చించారు. 13వ శతాబ్ధంలో "ఫిరంగి" కనుగొనబడిన తర్వాత సాపేక్షంగా రాకెట్ల వినియోగం తగ్గిపోయింది. రాకెట్ తయారీ రంగానికి టిప్పుసుల్తాన్, హైదర్ ఆలీలు పెద్దఎత్తున అందించిన సహకారాన్ని రొడ్డం విశ్లేషించారు. అప్పటివరకు రాకెట్లను వినియోగిస్తున్న వెదురు, కాగితం తొడుగులకు బదులుగా వీరు లోహపు తొడుగులు వుపయోగించిన విషయాన్ని ఆయన గమనించాడు. లోహపు తొడుగులు ఏర్పాటుచేయడం వల్ల రాకెట్లు పయనించే పరిధిని 2 కి.మీ. వరకు పెంచగలిగారు. ఈ రాకెట్లు తమతో ఎక్కువ బరువును తీసుకెళ్ళగల్గిన సామర్థ్యం కల్గి వున్నాయి. దీపావళి రాకెట్ల పథగమనాన్ని క్రమబద్ధం చేసేందుకు పొడవైన కర్రముక్కలను కట్టిన విధంగానే రాకెట్లకు పదునైన కత్తులను కట్టేవారు. శత్రు సైనికుల మధ్య పడినప్పుడవి ఆయుధాలవలె వుపయోగపడ్డాయి.

టిప్పుసుల్తాన్ భారీ స్థాయిలో రాకెట్లను తయారుచేయించాడు. బ్రిటిషువారికి వ్యతిరేకంగా సాగించిన యుద్ధాల్లో రాకెట్ దాడులను పెద్దఎత్తున వుపయోగించాడు. 1780లో పొల్లిలూర్ (ఆంగ్లేయులు, మైసూర్ రాజ్యానికి మధ్య జరిగిన రెండవ యుద్ధం) వద్ద జరిగిన యుద్ధంలో బ్రిటిష్‌వారి పరాజయంలో టిప్పు సాగించిన రాకెట్ దాడులు ప్రధాన పాత్ర వహించాయి. 4వ ఆంగ్లో మైసూర్ యుద్ధంలో టిప్పు పరాజయం పాలైన తర్వాత, వుపయోగించకుండా పెద్ద సంఖ్యలో మిగిలిపోయిన రాకెట్లను బ్రిటిషువారు ఇంగ్లండ్‌కు ఎత్తుకుపోయారు. ఇంగ్లండ్‌లో విలియం కాంగ్రేవ్ వీటిని శాస్త్రీయంగా అధ్యయనం చేశాడు. రివర్స్ ఇంజనీరింగ్ (అప్పటికే తయారుచేయబడిన వస్తువుల భాగాలను విడదీసి, వాటిని అధ్యయనం చేసి, వాటిని అభివృద్ధి చేయడం)గా నేడు చెప్పుకుంటున్న ప్రక్రియలో కాంగ్రీవ్స్ పరిశోధనలు సాగించి, అభివృద్ధి చేసిన రాకెట్లనే బ్రిటిషువారు నెపోలియన్ నాయకత్వంలో ఫ్రెంచి వారితో చేసిన యుద్ధాల్లోనూ, ఆ తర్వాత అమెరికన్లతోనూ జరిగిన యుద్ధాల్లోనూ వుపయోగించారు.

వైమానిక శాస్త్రం, రాకెట్ తయారీ పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడంలో భాగస్వామ్యం గురించి హిందూత్వ లాబీ మోసపూరితమైన వాదనలు చేస్తోంది. గత ఏడాది జరిగిన 102వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ముంబై విశ్వ విద్యాలయానికి చెందిన సంస్కృత విభాగం 'సంస్కృతం ద్వారా ప్రాచీన విజ్ఞాన శాస్త్రాలు" అనే శీర్షికతో ఒక సమావేశం నిర్వహించింది. ప్రాచీన భారత వైమానిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మీద ఇద్దరు ఉపన్యాసకులు ఒక పత్రం సమర్పించారు. రిటైరైన పైలట్ కెప్టెన్ ఆనంద్ జె బో డాస్ వారిలో ఒకరు. "ఆధునిక శాస్త్ర విజ్ఞానం అశాస్త్రీయమైనది". వేద కాలంలోనూ, ప్రాచీన భారతకాలంలో విమానం "గాలిలో ఎగురుతూ, ఒక దేశం నుండి మరో దేశానికి, ఒక ఖండం నుండి మరొక ఖండానికి, ఒక గ్రహం నుండి మరొక గ్రహానికి ప్రయణించగల్గిందని, అది ఎడమవైపుకు, కుడివైపుకు, వెనుకకు కూడ కదలగల్గిందని" ఆయన పత్రికలతో మాట్లాడుతూ, రత్నాల్లాంటి పలుకులు పలికాడు.

సుబ్బరాయశాస్త్రి రచించిన సంస్కృత గ్రంథంలోని 'వైమానిక శాస్త్రం' ఆధారం చేసుకుని బోడాస్ వాదించాడు. శాస్త్రి 1866 నుండి 1940 వరకు జీవించి వుండగా భరద్వాజుడు కనీసం 2000 సం.లకు ముందు కాలంలో జీవించి వున్నాడు. శాస్త్రి గారు తాను "మానసికంగా సమాధి స్థితిలో" వుండగా, భరద్వాజ మహర్షి ఆయన వద్దకు వచ్చి వైమానిక శాస్త్రాన్ని ఆయన చెపితే తాను వ్రాసినట్లు చెప్పుకున్న విషయం ఒక్కటే ఆ గ్రంథానికి పురాతనమైన సాక్ష్యం.

బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లోని వైమానిక, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఐదుగురు ప్రొఫెసర్ల బృందం ఈ "వైమానిక శాస్త్ర" గ్రంథాన్ని విస్తృతంగా అధ్యయనం చేసింది. వారు కొన్ని ఖచ్చితమైన నిర్ధారణలు చేశారు. "వైమానిక శాస్త్రం" ప్రాచీన గ్రంథం కాదని, అది 20వ శతాబ్ధం ప్రారంభంలో ఆధునిక సంస్కృత భాషలోనే గాని, వైదిక సంస్కృత భాషలో రచించబడ లేదని వారు నిర్ధారించారు. 'వైమానిక శాస్త్రం'లో పేర్కొన్న విషయాలు విజ్ఞాన శాస్త్ర వ్యతిరేకమైన అంశాలని, ఆ గ్రంథంలో వివరించబడినట్లు ప్రచారం జరుగుతున్న విధంగా, విమానాలను ఆ విధంగా నడిపి వుండడం సాధ్యం కాదని

వారు నిర్ధారించారు.

**భారతీయ వైద్యం :**

అధర్వణ వేదంలో పేర్కొన్నట్లు, కర్మకాండలు, వ్యావహారిక వైద్యంతో భారతీయ వైద్యం నిర్ణయాత్మకంగా తెగతెంపులు చేసుకుని, చరక సంహిత, శుశ్రుత సంహితల్లో పేర్కొన్న విధంగా పరిశోధనల ఆధారంగా నిర్ధారించిన పద్ధతుల్లో నిర్ణయం చేసే వైద్య విధానానికి మరలింది. గతంలో అందుబాటులో వున్న వైద్య విధానానికి పూర్తిగా భిన్నమైన విధంగా ఒక స్పష్టమైన భౌతిక వాద దృక్పథంతో కూడిన శాస్త్రీయ ప్రాతిపదికమీద ఆధారపడిన యీ వైద్య గ్రంథాలను గురించి దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ (పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, ఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రీసెర్చ్ వ్యవస్థాపక అధ్యక్షులు, సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సివిలిజేషన్స్ మాజీ ఛైర్మన్, హిస్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్, ఫిలాసఫీ అండ్ కల్చర్ ప్రోజెక్ట్ జనరల్ ఎడిటర్గా పనిచేశారు) వివరించారు. బౌద్ధా రామాల్లో బౌద్ధ వైద్య విధానం ప్రభావం, తర్వాత చరకుని వైద్య విధానంగా అభివృద్ధి చెందిన విధానంతో వున్న సంబంధాన్ని ఇటీవలి పరిశోధనలు వెల్లడించాయి.

**విజ్ఞాన శాస్త్రం అధ్యయనంతో కూడని పద్ధతులు :**

కేవలం ప్రాచీన గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారానే విజ్ఞానాన్ని సృష్టించవచ్చు నేడు హిందూత్వ వాదులు చేస్తున్న వాదనలను మధ్యయుగాల్లో భారత్, యూరపుల్లో విస్తృతంగా అమలు చేయడం జరిగింది. అంటే, అన్నిరకాల ప్రయోగాలను (పరిశోధనలను), ప్రకృతికి సంబంధించిన అధ్యయనాలు చేయడం నిమ్నవర్గాలు, భారతదేశంలో అయితే నిమ్నకులాల వారి కర్తవ్యమనే స్థాయికి దిగజార్చి, కేవలం మూలగ్రంథాలను వల్లె వేయడం ద్వారా మాత్రమే విజ్ఞాన సముపార్జన చేయాలన్న మాట! వివిధ సమాజాల్లో అభివృద్ధి చెందిన సజీవ సాంప్రదాయాలు, అలవాట్ల మీద యూరపులో మతపరమైన సాంప్రదాయాలను పాటించే మొనాస్టరీలలోని ప్రాచీన విజ్ఞానం ఆధిపత్యం చెలాయించింది. సారనాథ్లోని అశోకుని స్తంభం గురించి వారణాసిలోని గురుకులాలలోని వారికి

తెలియదు. అశోకుని రాజ శాసనాలతో కూడిన స్తంభాలు దేశవ్యాప్తంగా నెలకొల్పబడినప్పటికీ, “విజ్ఞాన ఖనులుగా పేర్కొనబడుతున్న” యీ గ్రంథాల్లో అశోకుని గురించిన సమాచారమే లేదు. భారతదేశంలో బౌద్ధానికి సంబంధించిన విజ్ఞానాన్నంతటిని (సమాచారాన్ని) బ్రాహ్మణ కులానికి చెందిన గ్రంథాలు నాశనం చేశాయి. అందువలన వారి గ్రంథాల్లో అశోకుని పాలన గురించి పేర్కొనబడలేదు,

భారతీయ విజ్ఞాన శాస్త్ర చరిత్రలో జైన, బౌద్ధమత సాంప్రదాయాలు, ఆచరణల ప్రభావానికి సంబంధించిన ఆనవాళ్ళు ఆసక్తి కల్గిస్తాయి. అవి రెండూ కూడా బ్రాహ్మణ మతానికి (ఆధిపత్యానికి) వ్యతిరేకం కావడంతో వేదాల ఆధిపత్యాన్ని తిరస్కరించాయి. కేవలం ప్రాచీనమైనది, వేదాల నుండి మాత్రమే గ్రహించిన విజ్ఞానంలో మాత్రమే విశ్వాసం గల్గిన వైదిక ఆలోచనా విధానం మీద ఆధారపడడం గాక, ఈ ఆలోచనా స్రవంతులు భారతీయ విజ్ఞాన శాస్త్రాన్ని, గణిత శాస్త్రాన్ని తర్కం (Reasoning), సాక్ష్యాధారాల పునాదులమీద నిలబెట్టేందుకు దోహదం చేశాయి.

దేశంలో విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం ప్రగతిని కుంటుపరచి, తిరోగమన మార్గం పట్టించేవిధంగా భారతీయ శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన ఒక మోసపూరితమైన చరిత్రను సృష్టించాలని హిందూత్వ లాబీ ప్రయత్నిస్తోంది.



# చరిత్రలో కాలనిర్ణయానికి సంబంధించిన వక్రీకరణల గురించి

*డా॥ ఆర్.పి. బహుగుణ*

**1.ప్రశ్న : మధ్యయుగం నాటి భారతచరిత్ర గురించి RSS అవగాహన మీద, చరిత్రలో వివిధ ఘటనలకు సంబంధించిన కాల నిర్ణయం గురించి వలసవాదుల పథకం ఏవిధమైన ప్రభావం చూపింది? ఈ కాలాన్ని "ముస్లింల పాలనాకాలం" గా అభివర్ణించడం పొరపాటా?**

**జవాబు :** 19వ శతాబ్దం ప్రారంభం నుండే వలస వాద చరిత్రకారులు భారత చరిత్రలోని ప్రాచీన కాలాన్ని "హిందూ ఇండియా"గానూ, మధ్యయుగంగా పేర్కొనబడిన కాలాన్ని "మహమ్మదీయుల పాలనా" కాలంగా నిర్ధారించారు. ఈ నిర్ధారణలు RSS సిద్ధాంతకర్తలు, RSS ప్రభావంలో వున్న చరిత్రకారుల మతతత్వ పూరిత లక్ష్యాల కనుగుణంగా వుండడంతో వారు చరిత్రకు సంబంధించిన ఈ కాల నిర్ణయాన్ని స్వీకరించారు. ఉత్తర భారతదేశం మహమ్మదీయుల దురాక్రమణలకు గురై వారి వశం కావడంతో మధ్యయుగం ప్రారంభమైనదన్న వలసవాద చరిత్రకారుల నిర్ధారణల్లోనే RSS నమ్మకముంచింది. 13, 17 శతాబ్దాల మధ్యకాలంలో పరిపాలన సాగించిన సుల్తానేట్ ఆఫ్ ఓమన్, మొఘల్ పాలకులు ఇస్లామ్ అనుయాయులు కావడంతో ఈ కాలాన్ని 'మహమ్మదీయుల పాలనా కాలం'గా భావిస్తోంది RSS.

అయినప్పటికీ, మధ్యయుగం నాటి భారత చరిత్రకు సంబంధించిన యీ వివరణలు పూర్తిగా అసత్యాలు. ఈ వివరణలు, వాస్తవాలను వక్రీకరించడంతోపాటు, చరిత్రలో వివిధ ఘటనలకు సంబంధించిన కాల నిర్ణయం విషయంలో సంకుచిత అవగాహనమీద ఆధారపడి వున్నాయి. ఈ క్రింది వాస్తవాలు, వాదనలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

పాలకుల మతం ప్రాతిపదికమీద ఆధారపడి వివిధ ఘటనలకు సంబంధించిన కాలాన్ని నిర్ణయించలేము. కేవలం పాలకుల మతంలో మార్పును బట్టి ఒక దశ నుండి మరొక దశకు పరివర్తన జరగదు. ప్రాచీన భారతాన్ని ఏలిన పాలకులందరూ హిందువులు కారు. వారిలో అత్యంత ప్రసిద్ధి చెందిన అశోకుడు హిందువు కాదు. బౌద్ధ మతస్తుడు, గుప్తుల పాలన తర్వాత 7 నుండి 12వ శతాబ్దం మధ్యకాలంలో ప్రారంభమైన అత్యంత తీవ్రమైన వూహాతీతమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పుల కారణంగానే ప్రాచీన యుగం నుండి మధ్య యుగానికి పరివర్తన జరిగింది. అంతేగాని తురుష్క (టర్కీ దేశీయులు) ప్రవేశించిన తర్వాత యీ పరివర్తన సంభవించలేదు. ఈ మార్పుల్లో భాగంగానే ప్రాంతీయ రాజ్యాలు, వివిధ సమాజాలు, సంస్కృతులు అభివృద్ధి చెంది, అనేక ప్రాంతాల్లో పశువుల పెంపకం నుండి వ్యవసాయానికి పరివర్తన సంభవించింది. దీనితోపాటు, వివిధ ప్రాంతీయ రాజ్యాలు, సమాజాల్లో అంతర్గతంగానూ, వాటికి వెలుపల సాగే వర్తక, వాణిజ్యాల్లోనూ, విత్త (డబ్బు) ఆర్థిక వ్యవస్థలోనూ ప్రాధాన్యత సంతరించుకున్న మార్పులు చోటుచేసుకున్నాయి. బౌద్ధం క్రమ క్రమంగా క్షిణించి (బ్రాహ్మణ మతం), వైదిక మతం తిరిగి నిలద్రొక్కు కోవడం ప్రారంభమైంది. సరిగ్గా యీ కాలంలోనే భక్తి వుద్యమం భారతదేశంలో, ప్రధానంగా దక్షిణ భారతంలో నిర్ధిష్టమైన రూపుదిద్దుకోవడ ప్రారంభమైంది. భారతదేశంలోకి వర్తకులుగా వచ్చిన అనేక ముస్లిం సమాజాలకు చెందినవారు, సూఫీలు (మహమ్మదీయ మతంలో ఒక శాఖ. వీరు ప్రకృతినే దైవంగా భావిస్తారు). అనేకమంది యాత్రీకులు, భారతదేశంలో హిందూ రాజుల పాలనలో వున్న వివిధ రాజ్యాల్లో శాంతియుతంగా స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. 11, 12 శతాబ్దాల్లో తురుష్కులు దండయాత్రలు సాగించి

దురాక్రమణకు పాల్పడడంతో, అప్పటికే కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులను కొత్త పద్ధతుల్లో వేగిరపర్చాయి. మొఘల్ సామ్రాజ్య స్థాపన భారతదేశ ప్రాచీన చరిత్రలో మరొక దశను సూచిస్తుంది.

చరిత్రలో వివిధ ఘటనలకు సంబంధించిన కాలాన్ని గుర్తించడంలో పాలకుల మతం ఒక ప్రధాన అంశంగా భావించవల్సివస్తే, మధ్యయుగం నాటి కాలంలో భారతదేశాన్ని పాలించిన రాజులందరూ ముస్లిం కారనే విషయాన్ని గమనించవల్సి అవసరం వుంది. ఢిల్లీ సుల్తాన్, వివిధ ప్రాంతాలకు చెందిన సుల్తానులు, మొఘల్ చక్రవర్తులు ముస్లిం మతస్తులు. కాని, విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తులు, వారి వారసులు, అనేక రాజపుత్ర రాజ్యాలను, మరాఠా సిక్కు, జాట్ రాజ్యాలను పరిపాలించిన వారు ముస్లిమేతరులే అంతేగాక, సైనిక ఘర్షణలు జరిగి పూర్తి అయిన తర్వాత ప్రారంభంలోనే హిందూపాలక సంపన్న వర్గాలు మొఘలాయి సామ్రాజ్య సుల్తానుల రాజ్యాలు సువ్యస్థితం చేసిన రాజ్య వ్యవస్థలో అంతర్భాగమైపోయాయి. అక్బర్ పాలనాపగ్గాలు చేపట్టినప్పటి నుండి రాజపుత్రులు మొఘలాయీపాలక వర్గంలో అవిభాజ్యమైన భాగమయ్యారు. రాజ పుత్రుల్లోని ప్రముఖ నాయకులు కొందరు సైనిక, పరిపాలనా వ్యవస్థల్లో అత్యున్నత స్థానాలలంకరించారు. అక్బరు పాలన ముగిసే నాటికి 7000మంది జాట్ల (జాట్ మొగలాయీ సామ్రాజ్యంలోని సైనిక, పాలనావ్యవస్థలో ఒక హోదా) సంఖ్య పెరగడం కొనసాగింది. ఔరంగజేబు హయాంలో వీరి సంఖ్య అత్యధిక స్థాయికి చేరుతుంది. మొగలాయీల కాలంలో పాలనా వ్యవస్థ నుండి హిందువులను మినహాయించడం జరిగిందని ఆర్.ఎస్.ఎస్ చేస్తున్న ప్రచారానికి భిన్నమైన విధంగా రాజ్యవ్యవవస్థలో హిందువులు కొన్ని అత్యున్నత స్థానాల్లో కూడ వున్నారు. షాజహాన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొఘలాయీ కులీన వర్గాల్లోకి మరాఠాలు కూడ ప్రవేశించడం మొదలైంది. 1595 (సం॥ అక్బర్ హయాంలో)లో 500 అంతకు మించిన స్థానాలలోని అత్యున్నత పదవుల్లో వున్న 98 మందిలో 22మంది హిందువులున్నారు. అంటే మొగలాయీ సైనిక, పాలనా వ్యవస్థలో 22.5 హిందువులున్నారు. ఔరంగజేబు

పాలనాకాలంలోని రెండవ అర్ధభాగం (1679–1707) 486 అత్యున్నత స్థాయి లోని వారిలో హిందువుల సంఖ్య 105కు అంటే 31.6 కి పెరిగింది. గ్రామాలు, ప్రాంతాలు, స్థానిక స్థాయిలో పాలక వర్గంగా వున్న జమిందార్లలో అత్యధికులు హిందువులే.

**2వ ప్రశ్న : మధ్యయుగాల నాటి భారత చరిత్రను హిందూ–ముస్లింల మధ్య ఘర్షణలతో కూడిన కాలంగా** ఆర్.ఎస్.ఎస్ **చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనంటారా?**

**జవాబు :** ఈ క్రింది కారణాల వల్ల మధ్యయుగంలో హిందూ–ముస్లిం ఘర్షణలను గురించిన ఆర్.ఎస్.ఎస్ చిత్రీకరణ అత్యంత లోపభూయిష్టమైనది :

ఆధునిక కాలంలో హిందూ ముస్లిం మధ్య ఘర్షణలకు దారితీసిన చారిత్రక పరిస్థితుల మధ్యయుగాల నాడు నెలకొని ఉండలేదు. రాజపుత్రులు, తురుష్కుల మధ్య; రాజపుత్రులు, మొగలాయిల మధ్య ; మొగలాయిలు, మరాఠాల మధ్య ; మొగలాయిలు సిక్కుల మధ్య రాజకీయపరమైన ఘర్షణలు జరుగుతుండేవి. అయితే పాలకవర్గాల రాజకీయ పరమైన రాజ్య విస్తరణకు సంబంధించిన పేరాసలే ప్రధాన కారణాలుగా ఉన్నాయేగాని, మతం ఏ విధంగానూ గణనీయమైన పాత్ర నిర్వహించలేదు. ముస్లిం మతానికే చెందిన తమ శత్రువులను, తిరుగుబాటుదారులను నిర్ధాక్షిణ్యంగా అణచివేయడంలో సుల్తానులు గాని, మొగలాయిలు కాని ఎవరూ తీసిపోలేదు. ముస్లిం పాలకులైన బీజాపూర్, గోల్కొండ సుల్తానుల రాజ్యాలను ఔరంగజేబు తన రాజ్యంలో కలుపుకునేందుకు సాగించిన యుద్ధమే ఇందుకు తార్కాణం.

ప్రారంభంలో సాగిన రాజకీయ, సైనిక ఘర్షణలు రాజకీయంగా ఏకీకరణకు, సహకారానికి దారితీశాయి. తుగ్లక్ హయాం నుండి హిందూ నాయకులను సుల్తానుల పాలకవర్గాల్లో చేర్చుకోవడం ప్రారంభమైంది. రాజపుత్ర వంశాలకు చెందిన అనేకమంది ప్రముఖులు ప్రాంతీయంగా వున్న సుల్తానుల పాలక వర్గాల్లో ఉండి ప్రధాన పదవుల్లో వున్నారు. దక్కన్ రాజ్యాల్లో సైనిక,

పాలనాపరమైన పదవుల్లో  మరాఠాలను నియమించటం జరిగింది. మొగలాయి రాజ్యాన్ని మొగలాయి, రాజపుత్రుల పాలకవర్గాల కలయికగా పేర్కొనదగిన స్థాయిలో రాజపుత్రులు, మొగలాయి పాలకవర్గంలో ఒక ప్రధాన భాగమయ్యారు.

పాలకవర్గ స్థాయిలో హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణ, సహకారాలు రెండింటికీ సంబంధించిన అనేక సందర్భాలు చరిత్రలో కనిపిస్తాయి. ఇది రాజకీయ, సైనిక పరమైన కారణాల వల్ల సంభవించినదే. అయితే రైతాంగం, వృత్తిదారులతో సహా సాధారణ ప్రజలకు సంబంధించినంతవరకూ హిందువులు, ముస్లింలనే బేదభావం లేనేలేదు. అందువలన హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణ అనే ప్రశ్నే తలెత్తదు. ఈ విధంగా మతపరమైన విబేధాలు కేవలం ఆధునిక కాలంలోనే సర్వసాధారణమై, పరివ్యాప్తమై పెద్దఎత్తున మతఘర్షణలు సంభవించే అవకాశాలు కల్పించాయి.

మధ్య యుగంలో అనేకమంది హిందూ పాలకులు పాలనాపరమైన విషయాలు, రెవెన్యూ విధానాల్లో సుల్తానులు, మొగలాయిలనే  అనుసరించారు. దాదాపు హిందూ పాలకులందరూ రాజ ఆస్థాన సంస్కృతి, సాంప్రదాయాలను పర్షియన్, ఇస్లామిక్ పాలకులను గురించిన విధానాల ప్రాతిపదికనే రూపొందించుకున్నారు. వేరొక ప్రక్క మొగలాయీ చక్రవర్తులు భారతదేశంలో అమలు జరుగుతున్న అనేక సాంప్రదాయాలను, చిహ్నాలను, క్రతువులను తమ రాజ్య వ్యవస్థలోనూ, రాజకీయ సంస్కృతిలోనూ వ్యవస్థాగతం చేశారు.

**3వ ప్రశ్న : మధ్యయుగాలలో భారతదేశంలో హిందువుల మీద ముస్లింలు దాడులను, సాగించినట్టు హిందువులు వంచించబడినట్టు చిత్రీకరించడం ఆర్.ఎస్.ఎస్  వారి తప్పెలా అవుతోంది?**

**జవాబు :** ఈ క్రింది కారణాల వల్ల ఇది వాస్తవాల మీద ఆధారపడిన అవగాహనకాదు:

దేవాలయాల విధ్వంసానికి సంబంధించిచూస్తే, కొందరు సుల్తానులు, మొగలాయీ పాలకులు తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్న వారి ఆధీనంలోని

ప్రాంతాల్లోని దేవాలయాల విచ్ఛిన్నానికి, విధ్వాంసానికి పూనుకున్నారనేది వాస్తవం. ప్రధానంగా వారి శతృవుల పోషణలో వుండడంతో పాటు, రాజకీయంగానూ, కొన్ని అంశాలకు ప్రతీకగా వుండి ప్రాధాన్యత సంతరించుకున్న దేవాలయాలను వీరు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఔరంగజేబుతో సహా మొగలాయీ చక్రవర్తులు అనేక దేవాలయాలకు పోషణ కల్పించి, అర్చకులకు ఆర్ధిక సహాయ మందించిన సందర్భాలనేకం వున్నాయి. బ్రజ్ ప్రాంతంలో అనేక దేవాలయాలు మొగలాయీలు మహారాజపోషకులు గా వున్నట్లు పెద్దసంఖ్యలో డాక్యుమెంటరీ సాక్ష్యాధారాలున్నాయి. వైష్ణవ, నాథ సాంప్రదాయాలు (శివునికి సంబంధించిన) పాటించే అనేక దేవాలయాలను మొగలాయీ పాలకులు పోషించారు. మహారాష్ట్రలోని పండరీపూర్‌లో వున్న విఠల్ ప్రభు దేవాలయాన్ని బీజపూర్ సుల్తానులు పోషించారు. దేవాలయాలను అపవిత్రం చేయడం, విధ్వంసం చేయడం చాలా సంక్లిష్టమైన విషయం. ఇది కేవలం ముస్లిం పాలకుల హిందూ వ్యతిరేక వైఖరి వల్ల మాత్రమే సంభవించిందని చెప్పడం సాధ్యం కాదు. ఉత్తర భారతంలో కొన్ని ప్రాముఖ్యత గల్గిన దేవాలయాలను విధ్యంసం చేసిన ఔరంగజేబు, తన పాలనా కాలంలో 26సం॥లు గడిపిన దక్కన్ (దక్కన్ పీఠభూమి ప్రాంతం – దక్షిణ, మధ్య భారతంలోని అత్యధిక ప్రాంతం), దక్షిణ భారతంలోనూ ఈ పద్ధతిననుసరించలేదు. ఆ ప్రాంతంలోని దాదాపు అన్ని దేవాలయాలు యిప్పటికీ యధాతథంగా వున్నాయి. అలహాబాద్‌లోని సోమేశ్వరనాధమహదేవ్ దేవాలయం, వారణాసిలోని జన్‌గమ్ బాడి శివ దేవాలయం, గౌహతిలోని ఉమానంద్ దేవాలయాలకు ఔరంగజేబు నిధులు మంజూరు చేసినట్లు నిరూపించేందుకు అనేక సాక్ష్యాధారాలున్నాయి. ఒకప్రక్క దేవాలయాలను ధ్వంసం చేస్తూ, వేరొక ప్రక్క కొన్ని దేవాలయాలకు నిధులు మంజూరు చేయడం చూస్తే, దీనిలో మతపరమైన ప్రేరణతో కూడిన దృక్పథం కంటె సంకుచిత రాజకీయాలే ప్రధానపాత్ర వహించాయని స్పష్టమవుతుంది.

ఫిరోజ్ తుగ్లక్ పాలనా కాలానికి ముందుకాలంలో ఢిల్లీ సుల్తానులు ముస్లిమేతరుల మీద జిజియా పన్ను విధించారనడానికి పెద్దగా సాక్ష్యాధారాలు లేవు. చివరకు క్రీ॥శ॥1579లో అక్బర్ జిజియా పన్ను రద్దు చేశాడు. క్రీ॥శ॥ 1679లో

ఔరంగజేబు తిరిగి యీ పన్ను విధించాడు. అంటే ఔరంగజేబు పాలనాకాలంలోని మొదటి 22సం॥ల కాలంలో యీ పన్ను విధించబడలేదు. ఔరంగజేబు పాలనా ముగిసిన తర్వాత యీ పన్ను రద్దు చేయబడింది. తిరిగి ఈ పన్ను నెవరూ విధించలేదు.

బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్పిడులకు సంబంధించి అత్యంత శ్రద్ధగా పరిశోధనలు సాగించిన చరిత్రకారులందరూ, యివి చాలా స్వల్ప సంఖ్యలో వున్నాయని నేడంగీకరిస్తున్నారు. దాదాపు అందరు ముస్లిం పాలకులు, వున్నత పదవుల్లో వున్నవారు హిందువులను బలవంతంగా ముస్లిం మతంలోకి మార్చడం జరిగిందనేది అసత్యం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో "ఇస్లామీకరణ" క్రమానికి గురైన పెద్ద సంఖ్యలోని రైతాంగం, చేతివృత్తులవారు, ఆధునిక కాలంలో వుపయోగిస్తున్న పరిభాషలో "హిందువులు" కారు, చివరకు ముస్లింలయిన వారందరు మొదట్లో హిందువులే ననేవాదన సరికాదు. అందువల్ల "మతంమార్పిడి" అనడంకంటే, "ఇస్లామీకరణ" అని పేర్కొనడం సమంజసంగా వుంటుంది. "ఇస్లామీకరణ" రాజ్యం ప్రేరణతో జరిగినదికాదు. అనేక సంక్లిష్ట సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాలకారణంగా క్రమక్రమంగా నెమ్మదిగా ఇస్లాం మతంలోకి సాగిన సాంస్కృతికీకరణ ఫలితంగా సంభవించిందే. ఈ పరివర్తనలో భాగంగానే పశు పాలన సాగించే గిరిజన తెగల వారు రైతాంగంగా పరివర్తన చెందడం ఒక అంశం. ఈ పరివర్తన జరిగే సుదీర్ఘ క్రమంలో భక్తి వుద్యమం ప్రభావితంలోకి వచ్చిన ప్రాంతాలు, తెగలవారు "హిందువులు" గానూ, సూఫీ, తదితర ముస్లిం దేవాలయాల ప్రభావంలో వున్నవారు "ముస్లిం" గానూ వున్నారు. భారత చరిత్రలో మధ్యయుగానికి చెందిన కాలన్ని "ఇస్లామీకరణ" జరిగిన కాలంగా కంటే, "హైందవీకరణ" జరిగిన కాలంగా పరిగణించాలి. పంజాబు, బెంగాలు లతోపాటు, దేశంలోని యితర ప్రాంతాల్లో ముస్లిం రైతాంగ ప్రజాసమూహాలు అభివృద్ధి చెందిన చారిత్రక క్రమాన్ని యీ విధంగా వివరించవచ్చు.

ఈ మతమార్పిడుల్లో అణచివేత స్వభావంగల్గిన వర్ణవ్యవస్థ పాత్రను తక్కువ చేసి చూడరాదు. రైతాంగం, చేతివృత్తులకు చెందినవారిలో అత్యధిక సంఖ్యాకులు

కులపరమైన తీవ్ర అణచివేతకు గురవుతున్న తక్కువ కులాలుగా చెప్పబడుతున్న కులాలకు చెందివున్నారు. కనీసం సూత్రప్రాయంగానైనా వివిధ విశ్వాసాలు గల్గిన వారి మధ్య తారతమ్యాలు చూపని ఇస్లాం వైపుకు వీరు ఆకర్షితులవడం ఆశ్చర్యకరమైన విషయంకాదు.

రైతాంగం, చేతివృత్తులవారు తమ మతంతో నిమిత్తం లేకుండా ఒకేవిధంగా దోపిడీకి గురయ్యారు. ముస్లిం మతానికి చెందిన రైతాంగం, చేతివృత్తులవారు కూడ, ప్రభుత్వానికి, జాగీర్దారులు నుండి జమీందారులు, చౌదరీలు అని పిలువబడే గ్రామపెద్దల వరకు భూస్వామ్య వ్యవస్థకు సంబంధించిన వివిధ స్థాయిల్లోని వారికి, హిందువులవలెనే ఒకే విధమైన భూమిసిస్తు తదితర పన్నులను చెల్లించవల్సి వుండేది. తొలికాలంనాటి రాజపుత్ర రాజ్యాలు మరియు తరువాతి కాలంలోని రాజపుత్ర రాజ్యాలు : చోళ చక్రవర్తులు, వారి తర్వాత వచ్చిన పాలకులు; ఢిల్లీ సుల్తానులు వారి వారసులు, విజయనగర సామ్రాజ్యాన్ని, మొఘల్ సామ్రాజ్యన్ని, మరాఠా, శిక్కు, జాట్ రాజ్యాల పాలకులు రైతాంగం నుండి అదనపు వుత్పత్తులు కైంకర్యం చేసుకునేందుకు బహిరంగంగానే సైనికబలగాలను వినియోగించడం మధ్యయుగాలనాటి భారతదేశంలోని రాజ్యాల్లో నిత్యకృత్యమైంది. పాలకులు హిందువులైనా, ముస్లింలైనా, వారిరాజ్యాలు మాత్రం ఉదార స్వభావం కల్గిన లేదా సంక్షేమ రాజ్యాలో కావు. మధ్యయుగాలనాటి భారత సమాజంలో నెలకొన్న వైరుధ్యాలు హిందువులు, ముస్లింల మధ్యగాక, అదనపు ఉత్పత్తులను లాగివేసుకునే హిందూ, ముస్లిం పాలకవర్గాలు(మతపెద్దల మద్దతుతో), అణచివేతకు గురవుతున్న కష్టజీవులైన రైతాంగం, వృత్తిదారుల మధ్య నెలకొని వున్నాయి. పాలకులు హిందువులైనా, ముస్లింలైనా పాలకులు సాగించిన అణచివేత చర్యలకు బలయింది రైతాంగం, చేతివృత్తులవారే. RSS ప్రచారం చేస్తున్న "హిందువుల బలిదానం" అనేది వారి మతపరమైన ఆలోచనల్లో భాగమే గాని, అది చారిత్రక వాస్తవాల మీద ఆధారపడినదికాదు.

పైన పేర్కొన్నట్లు మొగలాయీ పాలనవల్ల ప్రయోజనం పొందిన అనేక హిందూపాలక గ్రూపులు మొగలాయీ సామ్రాజ్యాన్ని పటిష్టం చేయడానికి చురుకైన

పాత్ర నిర్వహించాయి. 1576లో హాల్దీఘాటీ వద్ద రాణాప్రతాప్‌కు వ్యతిరేకంగా పోరాడిన సైన్యానికి అంబర్‌కు చెందిన రాజామాన్‌సింగ్ నాయకత్వం వహించారు. అక్బర్ హయాంలో బృందావనంలో కృష్ణ దేవాలయం నిర్మించడానికి రాజామాన్ సింగ్ ప్రధాన బాధ్యత వహించాడు. హాల్దీ ఘాటీ యుద్ధంలో పరాజయం పాలైన రాణాప్రతాప్ తన జీవితంలో చివరి 20సంగల కాలంలో ఆరావళీపర్వతాలు, పరిసరాల్లోని అడవుల్లో వుంటూ మొగలాయిల అధికారాన్ని ప్రతిఘటిస్తుండగా, వేరొక ప్రక్క తన హయాంలో అత్యంత శక్తివంతమైన హిందూ నాయకునిగా ఎదిగిన మొగలాయి నోబుల్ (వున్నత పదవిలో వున్నవాడు), సైనిక జనరల్ రాజామాన్ సింగ్ వైష్ణవ మత ప్రబోధకులకు, వైష్ణవ దేవాలయాలకు అందించిన ప్రోత్సాహం సమకాలీన మహాపురుషుల జీవితాల్లో కీర్తించబడడం ఒక ప్రధాన చర్చనీయాంశమైంది. అనేక మంది రాజపుత్రులు వారి చరిత్రలను వారి వీరోచిత కార్యాలను కీర్తించిన కవులు, గాయకులు, హాల్దీఘాటీయ యుద్ధాన్ని కచ్వా, సిసోడియా వంశాలకు చెందిన రాజపుత్రరాజ్యాల మధ్య ఘర్షణగా మాత్రమే చూడడం జరిగింది. ఆ కాలం నాటి రాజపుత్రుల రాజకీయ సంస్కృతి హోదాలు, శౌర్య పరాక్రమాలు, మాతృభూమితో వున్న అనుబంధం, విధేయతల మీద ఆధారపడి వుంది. ముస్లిం రాజులకు రాజపుత్రులకు మధ్య జరిగిన ఘర్షణలతోపాటు, వారి మధ్య నెలకొన్న సహకారాన్ని, వైవాహిక సంబంధాలను, యీ సాంస్కృతిక విలువల ప్రాతిపదికన నిర్ధారించవల్సి వుంది. హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణ, సహకారాలకు సంబంధించిన అంశాలను నిర్ధారించడంలో మతం ప్రధాన పాత్ర నిర్వహించలేదు. ఔరంగజేబు పాలనలో అంబర్ రాజు మీర్జా రాజాజైసింగ్ దక్కన్ కు గవర్నర్‌గానూ, శివాజీకి వ్యతిరేకంగా పోరాడిన మొగలాయి సైన్యాలకు అధిపతిగానూ వ్యవహరించాడు. గుజరాత్, మాళ్వాలకు గవర్నర్‌గానూ, వాయవ్యసరిహద్దు ప్రాంతంలో మొగలాయి సైన్యాలకు అధిపతిగా వ్యవహరించిన రాజా జస్వంత్ సింగ్ ఆయనకు సహాయంగా నిలిచాడు.

అసలు “ముస్లింల పాలన”కు బలికావడం మాట అటుంచి, అనేకమంది హిందూ మతపెద్దలు, హిందూ పాలక వర్గ గ్రూపులు మొగలాయిల పాలనలో

బాగా అభివృద్ధి చెందాయి. ఉదాహరణకు, మొగలాయీ సామ్రాజ్యానికి గుండెకాయవలె కీలకమైన బ్రజ్, అవధ్ ప్రాంతాలు, వైష్ణవ భక్తి వుద్యమానికి కేంద్రాలయ్యాయి.

**4వ ప్రశ్న : మధ్యయుగాల నాటి కాలాన్ని, 'విదేశీ' ముస్లిం పాలకుల పదఘట్టనల క్రింద హైందవ సంస్కృతి పతనమైన 'చీకటి' కాలంగా అభివర్ణించడంలో ఆర్.ఎస్.ఎస్ తప్పేంటి?**

**జవాబు :** RSS సిద్ధాంతకర్తలు చరిత్ర రచనకు వలసవాదుల ఆలోచనా విధానం మీద ఎక్కువగా ఆధారపడిన RSS సిద్ధాంతాకర్తలు, మధ్యయుగాల నాటి భారతంలో సమ్మిళిత సంస్కృతి, మతపరమైన అంశాలమీద ఏకాభిప్రాయం, మతసామరస్యం వర్ధిల్లినట్లు విస్తృత పరిధిలో అందుబాటులో వున్న అనేక విధాలైన సాక్ష్యాధారాలను వుద్దేశ్యపూర్వకంగానే త్రొక్కిపెడుతున్నారు. ఈ విషయంలో చరిత్రను వక్రీకరించే RSS ఆలోచనావిధానం, వారి అజ్ఞానాన్ని యీ క్రింది వాస్తవాలను పరిశీలించడం ద్వారా స్పష్టంగా అర్ధంచేసుకోవచ్చు.

జాతీయతకు సంబంధించిన ఆధునిక ఆలోచనా విధానం ప్రాతిపదికన విభజింపబడిన నేటి ప్రపంచానికి భిన్నమైన విధంగా, ఆధునిక భారతదేశ ముందుకాలానికి దేశ, విదేశీ అనే పదాలకు సంబంధించిన అభిప్రాయము పూర్తిగా భిన్నంగా వుండేవి. దండయాత్రలు, సైనిక దురాక్రమణలు, హింసాయుతమైన ప్రాంతీయ ఘర్షణలు, ప్రాంతీయ, స్థానిక గుర్తింపుకు సంబంధించిన ఆకాంక్షల పెరుగుదల, రాజ్యాలు, సామ్రాజ్యాలు ఏర్పాటు చేయడం, వాటిని రద్దుచేయడం, రవాణా, సమాచార వ్యవస్థల ఏర్పాటు తదితర పరిణామాలు ఒక ప్రాంతానికి సంబంధించిన అభిప్రాయాలు లేదా ఆలోచనలు నిరంతరం మార్పులకు గురి అయి, తిరిగి రూపుదిద్దుకున్నాయి. దేశభక్తియుతమైన భావనలు వివిధ పద్ధతుల్లో వుండేవి. అయితే అది ప్రస్తుతమున్న (ఆధునిక కాలానికి సంబంధించిన జాతీయతా వాదంతో కూడిన పద్ధతుల్లో మాత్రం కాదు. అరబ్బులు, తురుష్కులు, (టర్కీదేశీయులు), మంగోలియన్లు, ఆఫ్ఘన్లు, మొఘలాయీలు వివిధసమయాల్లో వర్తకులుగానూ,

యాత్రీకులుగానూ, సూఫీలు. మేధావులుగానూ, వృత్తినిపుణులుగానూ, ప్రధానంగా దురాక్రమణ దారులుగా మన దేశంలో ప్రవేశించారు. ఈ దండయాత్రలను, తీవ్ర పరివర్తనలకు గురవుతున్న సమాజాలకు చెందిన మధ్యఆసియా గిరిజన ప్రజల హింసాపూరిత వలసలుగా కూడ పరిగణించవచ్చు. వీరు ఒకసారి భూమి మీద స్థిరపడి, యీగడ్డను తమ నివాసంగా ఏర్పరచుకున్న తరువాత వారిని విదేశీయులుగా పరిగణించడం జరుగలేదు. రాజకీయ,సైనిక ఘర్షణలు జరుగుతున్న యీకాలంలోనే ప్రత్యర్థుల మధ్య ప్రతికూల విశ్వాసాలు అభివృద్ధి చెందాయి. ప్రశాంతత నెలకొనివున్న కాలంలో భారత సంపన్న పాలకవర్గాలు, రాజాస్థానాల్లో వుండే కవులు, రచయితలు (court writers) ముస్లిం రాజులకు చేసే విజ్ఞాపనలు అందరికీ ఆమోదయోగ్యంగా వుండేవి. ముస్లిం పాలకులు, ముస్లిం గ్రూపులు కూడ క్రమక్రమంగా భారతసాంప్రదాయాలను, భాషలను, సాంస్కృతికపరమైన ఆచారాలను పాటించడం జరిగింది.

మతం, కళలు, శిల్పశాస్త్రం, భాష, సాహిత్యం, న్యాయవిచారణ నిర్వహించే సంస్కృతి వంటి విషయాల్లో క్రమానుగతంగా వివిధ సంస్కృతులు ఒకదాని మీద మరొకటి ప్రభావం చూపించడం పెరిగింది. తురుష్కుల పాలనకాలం (సుల్తానేట్) నాటి అనేక సంస్కృత రచనల్లో ఆనాడు పరిపాలన సాగించిన సుల్తానుల మీద ప్రశంసల వర్షం కురిపించడం జరిగింది. సంస్క ృతంలోనూ, స్థానికభాషల్లో చేయబడిన రచనల్లోనూ, మధ్యయుగాలనాటి ముస్లిం పాలకులను బ్రాహ్మణమతానికి చెందిన దేవుళ్ళతో సమానంగా పరిగణించిన సందర్భాలనేకం వున్నాయి.

వేరొక ప్రక్క, దాదాపుగా తుగ్లకీపాలనా కాలంనాటి నుండి వివిధ మతాలకు చెందిన పరస్పర చర్చలకు సంబంధించిన వుదాహరణలనేకం మనం చూస్తాం. మహమ్మద్‌తుగ్లక్ సుల్తాన్ (1325–1351) హోళీ వుత్సవాల్లో పాల్గోనడమేగాక, జైన్ సాధువులతోనూ, నాథ్‌పంతియోగులతోనూ మతపరమైన చర్చల్లో పాల్గొన్నాడు. ప్రాంతీయ సుల్తానులు, మొగలాయీల పాలనాకాలంలో ఈ విధమైన చర్చలు మరింత ఎక్కువగా సాగాయి. ప్రముఖ కవి అమీర్ ఖుస్రూ రచించిన “నూసిఫిర్”

అనే తన గ్రంథంలో భారతదేశాన్ని, ఈదేశంలోని వాతావరణాన్ని, వివిధభాషలను ప్రత్యేకంగా సంస్కృత భాషను, ఈ దేశంలోని ప్రజలను, చివరకు జంతువులను ప్రశంసించడం ద్వారా తన దేశభక్తిని వెల్లడించుకున్నాడు. భారతదేశంలో నివశించే ప్రజలనుద్దేశించి "హిందూ" అనే మాట వుపయోగించడం అరబ్బులు, ఇరానీయులు యిచ్చిన బహుమతి అనే విషయాన్ని యిక్కడ పేర్కొనవలసి వుంది. మొట్టమొదటగా వారే ఈ ప్రాంతంలో నివశించే ప్రజలను హిందువులని పేర్కొన్నారు. ఆ తర్వాత క్రమంగా ప్రప్రథమంగా రాజపుత్రులు, ప్రాంతీయ ముస్లిమేతర పాలకులు, ఆ తర్వాత అగ్రకులాలకు చెందినవారు తమనుతాము హిందువులుగా పిల్చుకున్నారు. హిందూ, ముస్లిం పాలకవర్గాల మధ్య సాంస్కృతికపరమైన సంబంధాలు నెలకొనకుండా యిది సాధ్యమయ్యేది కాదు.

సుల్తానుల పాలనాకాలంలో శిల్పకళ, సంగీతం, సాహిత్యాల్లో పరస్పరం ఆమోదయోగ్యమయ్యే పోకడలు ప్రారంభమై, ప్రాంతీయ సుల్తానులు, మొగలాయీల హయాంలో మరింత ప్రస్ఫుటమయ్యాయి. సంగీతంలో యీ పోకడలకు అమీర్‌ఖుస్రూ నాంది పలికాడు. ప్రారంభకాలంలో నాటి చిష్టీ సూఫీయిజం (ఇది ఇస్లాంలోని ఒక సాంప్రదాయంను ఆఫ్ఘనిస్థాన్‌లోని హెరాన్‌కు సమీపంలోని చిష్టీ అనే ఒక చిన్న పట్టణంలో మొయినుద్దీన్ చిష్టీ ప్రారంభించాడు. ఇది ప్రేమ, సహసం, నిష్కపటత్వానికి ప్రాధాన్యత యిస్తుంది) లో పాటలు, వాద్యసంగీతం, నృత్యం, పద్యపఠనం, ప్రార్ధనలతోకూడిన 'సామా' లేదా సంగీత సమ్మేళనాలు భారతీయ సాంఘిక జీవనంలో పరిఢవిల్లాయి. సుల్తాన్‌ల పాలన చివరికాలంలో సంస్కృత రచనలను పర్షియన్ భాషలోకి తర్జుమా చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అక్బర్ తర్జుమా చేయడానికి ఏకంగా ఒక బ్యూరోను ఏర్పాటుచేసి, మహాభారతంతో సహా అనేక సంస్కృత రచనలను పర్షియన్ భాషలోకి అనువదింపజేశాడు. అబుల్ ఫజల్ ఐన్-ఇ-అక్బర్ అనే తన రచనలో అధిక హిందూమతంపట్ల సానుకూల భావనతోనూ, నిష్పాక్షిక దృష్టితోనూ హిందూమతం గురించి వివరించేందుకు కేటాయించాడు. మొగలాయీల హయాంలో ఉర్దూ భాష అభివృద్ధి చెందడం సాంస్కృతిక సమ్మేళనానికి ఒక చక్కని వుదాహరణ.

చివరిదే కాని, అత్యంతముఖ్యమైన విషయమేమిటంటే, హిందువులు,

ముస్లింల మధ్య సంబంధాల్లో మతపరమైన విషయాల్లో ఏకీభావం ఒక ప్రధాన లక్షణం. సూఫీ, భక్తి వుద్యమాలు పరస్పరం ఒకదానినొకటి బలపర్చుకుంటూ, ఉమ్మడి అభిప్రాయాలకు వస్తూండేవి. సూఫీ ప్రార్ధనాలయాలు హిందువులు, ముస్లింలు యిరువురిని ఆకర్షిస్తుండేవి. వేరొక ప్రక్క, గోగాచౌహాన్ వంటి గ్రామదేవతలు గూగాపీర్ వంటి పేర్లతో పూజలందుకుంటున్నారు. అనేకమంది సూఫీలు నాథ్‌పంథీ యోగులతోనూ, సాధు సంతులు, వైష్ణవులతోనూ సంబంధాలు కల్గివున్నారు. హైందవీసూఫీ ప్రణయగాధల రచయితలు తమ భావాలను వ్యాప్తిచేసేందుకు స్థానికి భాషలను, స్థానిక యితివృత్తాలను, మతపరమైన కల్పిత గాధలను ఎంపిక చేసుకున్నారు. (వివిధ మతాలకు చెందిన ప్రజల మధ్య శాంతియుత, సుహృద్భావ సంబంధాలుండాలని ప్రభోదించే) సుర్హ్-ఇన్-కుల్ అనే అక్బర్ భావనలు, ఇస్లాం మతంలోని భావవాదాన్ని ఉపనిషత్తులలోని తత్వజ్ఞానాన్ని సమ్మిళితం చేసి, అభివృద్ధి చేసేందుకు దారాషికోచేసిన ప్రయత్నాలు, మతపరంగా ఒక సమ్మిళిత సంస్కృతిని అభివృద్ధి చేయడంలో విశేషంగా తోడ్పడ్డాయి.

ఈ చారిత్రక పంథాను తుడిచి పెట్టాలని నేడు ఆర్.ఎస్.ఎస్ కోరుకుంటోంది.

*

# వివిధ సంస్థలను స్వాధీనం చేసుకుంటున్న ఆర్.ఎస్.ఎస్

ప్రొఫెసర్ పి. గోపీనాథ్

బి. జె.పి కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన తరువాత సాంస్కృతిక బహుళత్వం, సమానత్వం, విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు సంబంధించిన ఆలోచనలను, ఆచరణను పెంపొందించేందుకు స్థాపించబడిన వివిధ సంస్థలను, ఒక పద్ధతి ప్రకారం లక్ష్యం చేసుకుని నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. జాతి రాజ్యం ప్రకటించుకున్న లక్ష్యాలను సాధించడంలో యీ జాతీయ సంస్థలు ప్రధానపాత్ర నిర్వహిస్తాయి. ప్రస్తుత బి.జె.పి ప్రభుత్వం యీ సంస్థలను ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సంఘ్ పరివార్ దురభిమాన పూరిత లక్ష్యాల సాధనకు, తోడ్పాటు చేసుకోవాలని చూస్తున్నది.

ముస్లింలు, ఇతర మైనార్టీలను దిగువ స్థాయి పౌరులగా దిగజార్చి హిందూ ఇండియాని నిర్మించాలని, హిందూ జాతీయవాదంతోపాటు, హిందూ మహాసభ, ఆర్.ఎస్.ఎస్ వంటి దాని రాజకీయ సంస్థలు నిరంతరం వాదిస్తూనే వున్నాయి. ఈ విషయాన్ని సావర్కర్, హెగ్డేవార్, గోల్వాల్కర్‌లు తమ రచనల్లో పదే పదే పేర్కొంటూనే వున్నారు. హిందూ మతపరమైన గుర్తింపు ఆధిపత్యం ప్రాతిపదికన, ఒక భిన్నమైన భారతదేశానికి సంబంధించిన ఆలోచనలను వీరు ముందుకు తెచ్చారు. స్థూలంగా భారతదేశ బహుళత్వానికి ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తులు ఎదురుదెబ్బలు తిన్న ప్రతి సందర్భంలోనూ, హిందూ ఇండియా డిమాండు మరింత బలం పుంజుకుంటూనే వుంది. 1998లో మొట్టమొదటిసారి కొన్ని

ప్రాంతీయ పార్టీల మద్దతుతో ఆర్.ఎస్.ఎస్ కు సంబంధించిన బి.జె.పి నాయకత్వంలోని జాతీయ ప్రజాతంత్ర కూటమి కేంద్రంలో అధికారం చేపట్టినప్పుడు, తన హిందూత్వ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకుపోయే ధ్యేయంతో, ఉన్నత పరిశోధనలు, పాఠశాల విద్యకు సంబంధించిన సంస్థల లక్ష్యాలను వక్రీకరించడం మీద తన శక్తినంతటిని కేంద్రీకరించింది. ఈ ప్రణాళికలో భాగంగానే భారత చరిత్ర పరిశోధనా మండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రీసెర్చ్ -ICHR ), యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) తో సహా అనేక సంస్థలకు గణనీయమైన నష్టం కలుగజేసింది.

NDA-1 ప్రభుత్వం అన్ని జాతీయ సంస్థలను RSS,BJP వారితోనూ, హిందూత్వ లక్ష్యాలతో సంబంధం లేకపోయినప్పటికీ ప్రభుత్వంతో సహకరించి తోడ్పడేవారితో నింపివేసింది. లోక్‌సభలో బి.జె.పి మెజారిటీతో ఏర్పడిన ప్రస్తుత NDA-2 ప్రభుత్వం హిందూత్వ శక్తులు తమ ఎత్తుగడలను మార్చివేశాయి. ఇప్పుడు తమతో పయనించే ఇతర పార్టీలను వదలివేసి, దానికి బదులుగా విద్యా సంబంధమైన లేదా వృత్తిపరమైన నైపుణ్యంతో నిమిత్తం లేకుండా, సంఘ్ పరివార్‌కు చెందిన వివిధ సంస్థల్లో చురుకైనవారిని, ఆర్.ఎస్.ఎస్ దృక్పథం, లక్ష్యాలతో ఏకీభవించేవారిని ప్రధానమైన సంస్థల్లో నియమించడం జరిగింది. ICHR కు యల్లాప్రగడ సుదర్శనరావు, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (FTII) కు గజేంద్ర చౌహాన్‌ల నియామకాలు యిందుకు ప్రబల నిదర్శనాలు. నిజానికి, కేవలం ఆర్.ఎస్.ఎస్ సభ్యులు, మోడీకి బహిరంగంగా మద్దతు ప్రకటించిన వారిని మాత్రమే యీ సంస్థల్లో నియమించడం జరుగుతోంది.

విచ్ఛిన్నానికి గురైన మొదటి చారిత్రాత్మక సంస్థ ప్రణాళికా సంఘం స్వేచ్ఛా మార్కెట్ ప్రలోభాలకు లొంగిపోయి ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధిని నిర్వీర్యం చేసే, ఆ క్రమానికి ప్రణాళిక సంఘం మృతిని లాంఛనం చేసేందుకు భూమికను ఏర్పాటు చేసింది.

NDA-1లక్ష్యాలను సాధించే కృషి కొనసాగించే క్రమంలో నూతన ప్రభుత్వం చరిత్ర, సంస్కృతి, విద్యకు సంబంధించిన సంస్థలను తిరిగి తన లక్ష్యంగా పెట్టుకుంది.

సంస్థాగత విచ్ఛిన్నం ICHR లో ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ICSSR) , ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (IIAS), ది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రీసెర్చ్ (ICPR), నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్ (NCRI) లు స్వయం ప్రతిపత్తి గల్గిన ఇండిపెండెంట్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ (ICR) లో భాగం. ఈ సంస్థలకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుండి నిధులందుతున్నాయి. ఈ ఐదు సంస్థల్లో ICHR, కొద్దిగా తక్కువ మేరకు ICSSR సంఘ్ పరివార్ జోకానికి గురైయ్యాయి.

తన స్వంత పాత్రను, భారతదేశాన్ని ఒక హిందూ రాజ్యంగా మార్చాలన్న తన ఎజెండాకు చట్టబద్ధత కల్పించేందుకు ఆర్.ఎస్.ఎస్ కు చరిత్ర కీలకమైనది. చరిత్రకు సంబంధించి వారు చేసిన వాదనలు చారిత్రక పరిశోధనకు, తనిఖీకి నిలవకపోవడంతో అవి పదే పదే విఫలమయ్యాయి. NDA -1 హయాంలో ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ కె.ఆర్ ఫణిక్కర్, ప్రొఫెసర్ సుమీత్ సర్కార్లు సంపాదకులుగా, ముద్రణలో వున్న Towards freedom (స్వాతంత్ర్యం దిశలో) గ్రంథ సంపుటాలను, భారత చరిత్రలో 'వక్రీకరణల"ను 'సరిదిద్దడం' పేరిట వెనక్కు తెప్పించి, ఆ ప్రాజెక్టును మొత్తంగానే నిలిపివేయడం జరిగింది. వారు సరస్వతీ నదికి సంబంధించిన ఒక ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే ఇది ఆ తర్వాత కాలంలో యీ రంగంలో ప్రవీణులైనవారి ఆమోదం పొందలేకపోయింది. NDA-1 పాలన ముగియడంతో, నూతన కౌన్సిల్ యీ నిర్ణయాలను రద్దు చేసింది.

NDA -2 ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగానే కౌన్సిల్ పునర్నిర్మించింది. మరో పర్యాయం ఆ పదవిలో కొనసాగేందుకు అర్హత వున్న ఎనిమిదిమందిలో ఒక్కరికి కూడ కౌన్సిల్ స్థానం ఇవ్వలేదు. కౌన్సిల్‌లోని 18 మంది చరిత్రకారుల్లో ముగ్గురు లేదా నలుగురు తప్ప మిగిలినవారందరూ, అఖిలభారతీయ ఇతిహాస యోజన, కేరళ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్.ఎస్.ఎస్ అనుబంధ భారతీయ విచార కేంద్రాలకు చెందిన వారు ఆర్.ఎస్.ఎస్ లేదా బి.జె.పి కి మద్దతుగా వుండేవారి సలహాదారులే.

తమతోటి చరిత్రకారులు సహితం గుర్తించలేని చరిత్రకారులను ఈ సంస్థ ఛైర్‌పర్సన్‌గాను సభ్యులుగానూ నియమించడం పట్ల భారత చరిత్రకారులు

ప్రభుత్వాన్ని విమర్శించారు.

భారతీయ విధానం అనుసరించడంతో పాటు, ప్రాచీన భారత చరిత్ర గురించి నొక్కి వక్కాణించే విధంగా "భారత చరిత్ర రచనలో వక్రీకరణలను" తొలగించటం ప్రప్రథమ కర్తవ్యమని కొత్తగా పునర్నిర్మించబడిన ICHR స్పష్టంగా పునరుద్ఘాటించింది. చరిత్రను శాస్త్రీయంగా రచించే సందర్భంగా అంధ విశ్వాసాలకు తావియ్యరాదని, భారతదేశ బహుళత్వ స్వభావాన్ని, లౌకికతత్వాన్ని ప్రోత్సహించేవిధంగా శాస్త్రీయంగా చరిత్ర రచనను ప్రోత్సహించాలని ప్రకటించే ICHR రాజ్యాంగంలో మార్పులు చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.

ఏ ప్రమాణాలతో చూచినప్పటికీ నిపుణులైన చరిత్రకారులుగా పరిగణించడానికి వీలులేని విద్యావంతులు, గురువులు (మత గురువులు)ను ఆహ్వానించటం ద్వారా ఈ కర్తవ్యాల సాధన కృషి ప్రారంభించటం జరిగింది. భారత చరిత్రకారులను పనికిమాలిన వారిగా నిందించిన బెల్జియం ప్రొఫెసర్ ఒకరు కాగా, మనం తిరిగి వేదాల వైపుకు మరలాలని, "భారత చరిత్ర నుండి ఎరుపును (వామపక్షా భావాలు కల్గిన వారిని) తొలగించాలని", గట్టిగా అభిప్రాయపడిన అమెరికన్ యోగా గురువు మరొకరు. విద్యావిషయకమైన విషయాలమీద ఎవరైనా తమ అసమ్మతి వ్యక్తం చేస్తే, దిగుమతి చేసుకున్న ఆర్.ఎస్.ఎస్. గుండాల అవహేళనను ఎదుర్కొనవల్సి వచ్చింది.

అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధిగాంచిన ICHR (సమాచార) పత్రిక ది ఇండియన్ హిస్టారికల్ రివ్యూ సంపాదకుడు ప్రఖ్యాత చరిత్రకారుడు సవ్యసాచి భట్టాచార్యను ఎడిటర్ బాధ్యతల నుండి తొలగించడం రెండవ చర్య. ప్రపంచంలో అత్యుత్తమ చరిత్రకారులు కొందరు సభ్యులుగా వున్న పత్రిక సలహా సంఘాన్ని మొత్తంగా రద్దు చేయడం జరిగింది. ఇది మూడవ చర్య. అయితే యీ సలహా సంఘాన్ని ఏవిధంగా పరిశీలించినా వారిలో అందరూ మార్క్సిస్టులు కారు. పత్రిక సలహా సంఘాన్ని రద్దు చేయడం పట్ల తన అసమ్మతిని వ్యక్తం చేసేందుకు అనుమతించకపోవడంతో ICHR మెంబర్ సెక్రటరీ జూన్ నెలలో రాజీనామా చేశారు.

ప్రస్తుత పరిశోధనలను రద్దుచేసి, భారతదేశానికి సంబంధించిన గతాన్ని గురించి "వక్రీకరణకు గురికాని" చరిత్రను అందిస్తామని ICHR కౌన్సిల్ చైర్మన్,

రావ్ ఇతర సభ్యులు వాగ్దానం చేశారు. భారతదేశం యొక్క గతాన్ని గురించిన యీ "ఖచ్చితమైన" దృక్పథంలో చారిత్రక రికార్డులు, వివరణలకు వేదాలు ప్రాతిపదికగా వుండాలి. అందువలన ప్రాచీన భారతానికి సంబంధించిన అధ్యయనానికి ప్రాధాన్యత యివ్వడం జరిగింది. కులం, మతం వంటి అంశాలు అనేక సంవత్సరాలుగా చర్చనీయాంశాలుగా వుండడంతో పాటు, ప్రసిద్ధిపొందిన విద్యా విషయిక రచనలు అసంఖ్యాకంగా ప్రచురితమయ్యాయి. ఇప్పుడ ఆర్.ఎస్.ఎస్ అవగాహనను గమనంలో వుంచుకుని, యీ అంశాలను స్పాన్సర్ చేయడం జరుగుతుంది.

ప్రాచీన భారత చరిత్ర వ్రాసేందుకు  సంస్కృత గ్రంథాలను ఆధారంగా చేసుకుని ఒక పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేయడం తదుపరి కర్తవ్యం. మొదట ఈ ప్రాజెక్టును అనధికారికంగా, సుబ్రమణ్యస్వామి సమక్షంలో ఢిల్లీ విశ్వ విద్యాలయంలోని సంస్కృత విభాగానికి మంజూరు చేయడం జరిగింది. ఈ సమావేశంలోనే ఆయన రొమిల్లాథాపర్, బిపిన్ చంద్రల గ్రంథాలను తగులబెట్టాలని డిమాండు చేశాడు. సంస్కృతంలో వున్న మూలరచనలను వుపయోగించుకున్నారు. భారత చరిత్రను ప్రాచీన భారతం అనే ప్రిజమ్ (త్రిభుజాకార పట్టకం) గుండా చూడాలని వాదిస్తున్న ICHR కౌన్సిల్ సభ్యులకు సంస్కృతం భాష రాకపోవడం గమనించవల్సిన  విషయం.

ప్రస్తుతం ICHRకి మెంబర్ సెక్రటరీ లేడు. మెంబర్ సెక్రటరీ నిర్వర్తించవల్సిన విధులు ఛైర్మన్ తానే నిర్వహిస్తున్నాడు. కౌన్సిల్‌కు సంబంధించిన చట్టబద్ధమైన కమిటీల సమావేశాల మినిట్సు కౌన్సిల్ వెబ్‌సైట్ లో యిక ఏమాత్రం కానరావు. అంటే భారత చరిత్ర రచనలోని వక్రీకరణను రహస్యంగా సరిదిద్దు తారన్నమాట!

1969లో స్థాపించబడిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రిసెర్చి (ICSSR) సంస్థ తన రాజ్యాగంలో మార్పులు చేపట్టడం ద్వారా ప్రభుత్వం ఎత్తులను చిత్తుచేసింది. ఈ సంస్థ రాజ్యాంగానికి సవరణ చేయడం ద్వారా ICHR  లో వలె పాలనాపరమైన ఆదేశాల ద్వారా టోకు (పెద్ద ఎత్తు గా మార్పులు చేసేందుకు వీలు లేకుండా చేయడం జరిగింది. సవరించబడిన నిబంధనల ప్రకారం ప్రస్తుతమున్న కౌన్సిల్ సభ్యులు, ప్రస్తుతం ICSSR జాతీయ ప్రొఫెసర్లుగా వున్నవారు, గతంలో

జాతీయ ప్రొఫెసర్లుగా పనిచేసినవారు, కొత్త కౌన్సిల్ సభ్యత్వానికి ప్రతిపాదనలు (నామినేట్) చేయవల్సి వుంటుంది. ఇంత పెద్ద సంఖ్యలో వున్న విద్యావంతుల బృందం నుండి BJP తన యిష్టప్రకారం నామినేషన్లు వేయించడం సాధ్యమయ్యేపనిగాదు. అందువల్ల, ICSSR సంస్థ, రెగ్యులర్ మెంబర్ సెక్రటరీ లేక పోవడమే విషయం మినహాయిస్తే, పెద్దగా మార్పులు లేకుండానే కొనసాగుతోంది. ప్రస్తుత ఛైర్మన్ BJP చేత నియమించబడినవాడుకాదు. ICHR లో వున్న పరిస్థితికి భిన్నంగా, వాణిజ్య శాస్త్రం (కామర్సు) నుండి భౌగోళికశాస్త్రం, అర్థశాస్త్రం వరకు అనేక విభాగాలకు సంబంధించిన పరిశోధనలను సమన్వయం చేసే ICSSR లో BJP, RSS ప్రత్యక్ష అధికారం చెలాయించే అవకాశాలు తక్కువగా వున్నాయి. చరిత్రకు సంబంధించిన పరిశోధనవలె కాక యితర విభాగాలకు (విషయాలకు) సంబంధించిన పరిశోధనలు, మితవాద హిందూత్వం అభివృద్ధి నిరోధక, రాజకీయాలమీద తక్షణ, ప్రత్యక్ష ప్రభావం చూపవు.

1961లో నెలకొల్పబడిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (NCERT), BJP,RSS ల దృష్టినాకర్షించిన మరొక సంస్థ. BJP తన మతపరమైన విశ్వాసాలను బలవంతంగా రుద్దేందుకు పాఠశాల విద్యకు సంబంధించి జాతీయ పాఠ్యప్రణాళికను రూపొందించే బాధ్యతలు నిర్వహించడంతో పాటు, ఉపాధ్యాయులకు శిక్షణ కూడ యిస్తున్న (NCERT), ఒక బలమైన సాధనంగా కన్పడింది. BJP తన గత పాలనాకాలంలో (NCERT), నిర్ణయించిన పాఠ్యపుస్తకాలను మార్చివేసింది. అయితే BJP పాలన ముగిసిన తర్వాత యీ మార్పులను రద్దు చేయడం జరిగింది. తమ ఆదేశాలను అమలు చేయించేందుకు, RSS,BJP చాలా తొందరపడుతున్నాయి. NCERT డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రవీణ్ సింక్లెయిర్ మీద (HRD) మంత్రిత్వ శాఖ ఆర్థికపరమైన అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు చేయడం వల్ల తన పదవికి రాజీనామా చేసే పరిస్థితి కల్పించడం జరిగింది. జాతీయ పాఠ్యప్రణాళిక స్వరూపాన్ని గురించి సమీక్షించే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిన 21 కమిటీల నివేదికల మీద సమీక్ష మధ్యలో వుండగా ఆమెకు వుద్వాసన చెప్పడం మిక్కిలి ఆసక్తికరమైన విషయం. ప్రభుత్వంతో సంప్రదించకుండా NCERT తొందరపడి సమీక్ష చేపట్టడాన్ని RSS కు చెందిన దీనానాథ్ బత్రా అంతకుముందే విమర్శించాడు.

NCERT డైరెక్టర్ స్థానాన్ని సంవత్సర కాలానికి పైగా ఖాళీగా వుంచి 2015 సెప్టెంబరునెలలో హృషీకేష్ సేనాపతిని కేంద్ర ప్రభుత్వం డైరెక్టర్‌గా నియమించింది. ఇదిలా వుండగా, అంబాచరణ్ వశిష్ఠను NCERT పబ్లికేషన్ల విభాగానికి సలహాదారుగా నియమించడం జరిగింది. అయనే పౌరసంబంధాల నిర్వహణకూడ చూస్తాడు. ఆయన గతంలో BJP కి చెందిన కమల్ సందేశ్ పత్రిక సంపాదక వర్గ సభ్యుడు. తీస్తాసెతల్వాద్ మీద దాడి చెయడానికుద్దేశించిన ఒక పుస్తకాని కాయన సంపాదకుడు.

దినేషనల్ బుక్ ట్రస్ట్ (NBT) HRD మంత్రిత్వశాఖ నిధులతోనడిచే మరొక సంస్థ. వివిధ భారతీయ భాషల్లో వున్నత స్థాయి సాహిత్యాన్ని సరసమైనధరలను ప్రజల కందుబాటులో ధ్యేయంతో 1957లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రు NBT ని స్థాపించారు. సక్రమమైన పద్ధతిలో NBT ఛైర్మన్‌గా నియమితులైన సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, ప్రముఖ మళయాళ రచయిత సేతుమాధవన్‌ను ఆయన పదవీకాలం ముగియకముందే, ఆపదవిని వదలి వెళ్ళవల్సిందిగా మృదువుగానే హెచ్చరించారు. ఊహించిన విధంగానే ఆయన స్థానంలో RSS పత్రిక పాంచజన్య మాజీ ఎడిటర్ బల్‌దేవ్ శర్మ NBTఛైర్మన్‌గా నియమితుడయ్యాడు. దీనితో సంతృప్తి చెందని BJP ప్రభుత్వం, ఇటీవలనే BJP తీర్థం పుచ్చుకున్న అసోంగణపరిషత్ నాయకుని సతీమణి రీతిచౌధురిని డైరెక్టర్‌గా నియమించింది. గతంలో యీ పదవికి యితరులతోపాటు ఇంటర్వ్యూకు హాజరైన యీమె ఆ పదవికి తగిన వ్యక్తి కాదని తేలిన తర్వాత యీ నియామకం జరిగింది.

మోడిని భగవంతుని అవతారంగా అభివర్ణించిన 87సం॥ల లోకేశ్ చంద్ర, భారత సాంస్కృతిక సంబంధాల మండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ - ICCR) అధిపతిగా నియమితుడయ్యాడు. ఆయన రామాయణ, మహాభారతాలనాధారం చేసుకుని, రూపొందించిన కార్యక్రమాల ద్వారా భారతదేశానికి, ఆగ్నేయాసియా దేశాల మధ్య సంబంధాలనభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాడు. 2015అక్టోబర్ నెల చివరలో ICCR ఆధ్వర్యంలో "భారత్, రష్యా ఇతర పొరుగు దేశాల్లో భారతఉపఖండానికి చెందిన చరిత్ర, సంస్కృతులు, భాషలు, సాహిత్యం గురించిన అధ్యయనం – గతం, వర్తమానం, భవిష్యత్తు" అనే అంశం మీద మాస్కోలో సమావేశం జరిపారు. రష్యా తదితర పొరుగుదేశాల్లోని

విద్యారంగంలోని ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని క్రోడీకరించి, దానిని వుపయోగించుకునే మార్గాలనన్వేషించడం యీ సమావేశా లక్ష్యాల్లో ఒకటి. సంస్కృతంలో వున్న గ్రంథాలనాధారంచేసుకుని, ప్రాచీన భారత చరిత్రను సవరించి వ్రాయడంలో ICHR సహకారమందిస్తున్న ఢిల్లీ విశ్వవిద్యాలయం, సంస్కృత విభాగం అధిపతి ఈ సమావేశానికి భారతదేశంతర పునఃసమన్వయకర్తగా వ్యవహరించాడు.

"తమకనుకూలమైన చరిత్రను కనుక్కొనే" BJP-RSS రాజకీయాల్లో భారతపురావస్తు పరిశోధనశాఖ (ASI) కీలకపాత్ర పోషించింది. పురావస్తు శాఖ పరిశోధనకు సంబంధించి త్రవ్వకాలు నిర్వహించవల్సిన పద్ధతులకు భిన్నంగా అయోధ్యలో త్రవ్వకాలు నిర్వహించి, అసలు ఏనాడూ ఉనికిలో లేని దేవాలయాన్ని బాబ్రిమసీదు క్రింద" కనుక్కొన్నందుకు ASI తీవ్ర విమర్శలకు గురయ్యింది. BJP అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధర్వర్యంలోకి వచ్చే ASI సరస్వతీనదిని కనుక్కొనేందుకు పూనుకుంటుంది. NDA-1 ప్రభుత్వం అధికారం నుండి తొలగించబడిన తర్వాత ఏనాడో కనుమరుగైన సరస్వతీనది కోసం అన్వేషణ నిలిపివేయబడింది. ప్రస్తుత ప్రభుత్వం సరస్వతీనది కోసం చేసే అన్వేషణను తిరిగి ప్రారంభించవల్సిందిగా ASI ని ఆదేశించడం జరిగింది. నదిని కనుగొనేందుకు BJP-RSS లు ఎంత అత్యుత్సాహం ప్రదర్శించాయంటే, వాయవ్యప్రాంతంలో హాక్రా, ఘగ్గర్ నదీ పరీవాహకప్రాంతం (బేసిన్) ASI త్రవ్వకాలు సాగిస్తుండగానే, నీటివనరులు, నదులఅభివృద్ధి, గంగానది పునర్నవీకరణ కేంద్ర మంత్రి కనుమరుగైన సరస్వతీనదీ మూలాన్ని, నదీ ప్రవాహ మార్గాన్ని గుర్తించేందుకు అలహాబాదుకోటలోని బావిలోని నీటిని పరీక్షించవల్సిందిగా కేంద్ర భూగర్భజల బోర్డును ఆదేశించారు.

నేషనల్ ఆర్చీవ్స్ (ప్రాచీన పత్ర భాండాగారం) ఆఫ్ ఇండియా, నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీలకు సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ నేషనల్ ఆర్చీవ్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్గా అదనపు బాధ్యతలు అప్పగించడం జరిగింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రాజీనామా చేయవలసి వచ్చింది. లలిత కళా అకాడమీ అధిపతిని కూడా నిర్దాక్షిణ్యంగా తొలగించారు. దీనికి కేంద్రంలో ఛైర్పర్సన్

లేరు.

కేవలం ఒక పౌరాణిక TV సీరియల్ నటించిన B గ్రేడ్‌నటుని ఫిల్మ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ అధిపతిగా చేయడానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం సాగిన ఆందోళనను ప్రభుత్వం అణచివేసింది. ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతో జరిపిన చర్చలు విఫలం కావడంతో గజేంద్ర చౌహాన్ నియామకానికి వ్యతిరేకంగా విద్యార్థులు నాలుగు నెలలుగా చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమించారు.

భారతదేశాన్ని హిందూమత రాజ్యంగా మార్చే తమ కుట్రపూరిత లక్ష్యాల సాధనకు, మన భారతదేశానికి విశిష్ట లక్షణమైన బహుళత్వంతో కూడిన జాతీయ సంస్కృతి శాస్త్ర పరిశోధనల ద్వారా మరింత పెంచి, పోషించే ధ్యేయంతో స్థాపించబడిన ఈ సంస్థలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రభుత్వం బాహాటంగానే ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నాలు, యీ సంస్థలు పూర్తిగా నాశనం చేయబడుతున్నాయి లేదా మూగబోయేట్టు చేయబడుతున్నయి. 'ఎవరో కొద్దిమంది మేధావులు, కళాకారుల అంగీకారం కోసం కాక' కేవలం ప్రజల మనోభావాలను సంతృప్తి పరిచే మేరకు మాత్రమే విజ్ఞాన, శాస్త్రీయ భావాల ప్రచారాన్ని పరిమితం జేయాలన్న హిట్లర్ భావాల పట్ల నమ్మకం కల్గిన ప్రభుత్వం, భారతదేశంలోని సాంస్కృతిక, మేధోపరమైన విద్యాసంస్థలను పరిమితస్థాయిలో శాస్త్ర విజ్ఞానాన్ని అందించే ఏజెన్సీల స్థాయికి దిగజార్చడం జరుగుతోంది.

మొత్తంగా చూచినప్పుడు ఈ సంస్థలన్నింటికోసం వినియోగించే నిధులు భారీ స్థాయిలోనే వుంటాయి. పాఠశాల, ఉన్నత విద్య, మానవీయశాస్త్రాలు (హ్యూమానిటీస్), సామాజిక శాస్త్రాలు (సోషల్‌సైన్సెస్), విజ్ఞానశాస్త్రం ల మీద పరిశోధన ప్రచురణలు, సాంకేతిక కార్యకలాపాలు, వారసత్వ సంపద ప్రముఖ పురాతన కట్టడాల పరిరక్షణ, వాటి నిర్వహణకు నిధుల మంజూరు, గ్రంథాలయాలు, మ్యూజియంలు, ప్రాచీన పత్ర, గ్రంథ భాండాగారాల నిర్వహణ, విస్తరణ; విద్యార్థులకు స్టైపెండ్స్ (విద్యార్థివేతనాలు), విశిష్ట పరిశోధనలకు వేతనం (ఫెలోషి నిర్దిష్ట ప్రచురణలకు, ప్రచురణ కర్తలకు, సబ్సిడీలు, భారతదేశంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు, విదేశీరాయభార కార్యలయాల్లో పెద్ద సంఖ్యలో పుస్తకాల కొనుగోలు,

యువజన కార్యకలాపాలు, క్రీడలు స్త్రీ, శిశుసంక్షేమం తదితర కార్యకలాపాలతోపాటు విస్తృత పరిధిలో కార్యకలాపాల నిధులు మంజూరు చేయడం జరుగుతోంది.

ప్రాధాన్యతలు, విధానాల్లో మార్పులు, ఇంత విస్తృత స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థను స్వాధీనం చేసుకోవడంతో అనేక అంశాల్లో సంఘ్‌పరివార్ లక్ష్యాలకనుగుణంగానూ, మైనారిటీలకు, ఆవేదనకు గురవుతున్నవారికి, పేదరికంలోకి నెట్టబడిన వారికి రక్షణ కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించి లక్ష్యాలనుండి దూరంగా జరిగే విధంగానూ, జ్ఞాన సముపార్జనలో నిర్ణయాత్మకమైన మార్పులకు దారి తీస్తుంది. దీనితో వేలాదిమంది బి.జె.పిని ఆశ్రయించిన వృత్తినిపుణులు (ప్రొఫెషనల్స్), విద్యావంతులకు, సాంస్కృతికరంగంలో పనిచేసేవారికి, మేధావులకు ప్రభుత్వంలో అవకాశాలు కల్పిస్తున్నారు.

1) (http//times of india times, com/70 - year - old - with - links - to - BJP - magazine - NCERT - consultant/articleshow/47607959,cms)
2) http // indiatoday. intoday. in /story/bjp - governmont - saraswati - asi - river - renewssearch - ancient/1/394971.html.
3) Adolf Hitler, Mein kampf. http.//www.greatwar.nl/books/mainkamps/pdf

*

# వివిధ సంస్థల స్వాధీనం ఆర్ ఎస్ ఎస్ మార్గం

**సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సెన్సార్‌బోర్డు) :** 2014లోక్‌సభా ఎన్నికల ముందు "హార్ హర్ మోడి, ఘర్ ఘర్ మోడి" నినాదం సృష్టించిన ప్రముఖ సినీ నిర్మాత పహ్లాజ్ నిహలానీ 2015 జనవరిలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సెన్సార్ బోర్డు) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన మోడి మీద ప్రశంసలు కురిపిస్తూ తీసిన వీడియో "మేరా దేశ్ హై మహాన్" వివాదాస్పదమైంది. ఆయన వ్యవహారశైలి అనేక మంది సినీ నిర్మాతలు, దర్శకుల ఖండనలకు గురైంది. అది ఆయనకు ఆ పదవి నుండి తొలగించాలనే డిమాండు వరకు వెళ్ళింది.

**ప్రసార్ భారతి** BJP అనుకూల పత్రిక "పయొనీర్" కన్సల్టింగ్ ఎడిటర్, ఢిల్లీలో ఆర్ఎస్ఎస్ అనుకూల ఆలోచనాపరులతో కూడిన వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో సభ్యుడు. ఎ. సూర్యప్రకాష్, దూరదర్శన్, ఆకాశవాణిలను నిర్వహించే స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ప్రసారభారతికి అధిపతిగా నియమితులయ్యారు.

NCERT: పాఠశాల విద్యకు సంబంధించిన జాతీయ పాఠ్య ప్రణాళికను రూపొందించి, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే NCERT డైరెక్టర్, ప్రొఫెసర్ పర్వీన్ సింక్లెయిర్, ఆమె పదవీ కాలం ముగియడానికి రెండేండ్ల ముందే, 2014 అక్టోబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు. ఆమె మీద అవినీతి ఆరోపణలు వచ్చాయి. జాతీయ పాఠ్య ప్రణాళిక సమీక్ష కుద్దేశించిన 21 కమిటీల నివేదికల మీద సమీక్షలు చివరి దశలో వుండగా ఆమెకు ఉద్వాసన పల్కడం జరిగింది. ఆమె స్థానంలో హృషేకేశ్ సేనాపతిని డైరెక్టర్‌గా నియమించారు. గతంలో BJP కి చెందిన కమల్ సందేశ్ పత్రిక

సంపాదకవర్గం సభ్యుడుగా పనిచేసిన అంబాచరణ్ వశిష్ఠను NCERT పబ్లికేషన్ల విభాగానికి సలహాదారుగానూ, పౌర సంబంధాల బాధ్యునిగానూ నియమించడం జరిగింది. తీస్తా సెతల్వాడ్ మీద దాడి చేయడానికుద్దేశించిన ఒక పుస్తకానికాయన సంపాదకుడు.

**విశ్వవిద్యాలయాలు** : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నలందా అంతర్జాతీయ విశ్వవిద్యాలయం (బీహార్‌లో) చాన్స్‌లర్‌గా వున్న ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్, BJP ప్రభుత్వ వైఖరి వల్ల చాన్స్‌లర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆయన ఒక బహిరంగ లేఖలో, యూనివర్శిటీ గవర్నింగ్ బోర్డు తనను చాన్స్‌లర్‌గా కొనసాగవల్సిందిగా ఏకగ్రీవంగా నిర్ణయించిందని, ఆ నిర్ణయానికి ప్రభుత్వం నుండి చాలా కాలంపాటు ఆమోదం లభించకపోవడంతో, తాను ఆ బాధ్యతలో మరో టర్మ్ కొనసాగడం సమంజసం కాదని భావించి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

రాజస్థాన్‌లో సంఘ్ పరివార్‌తో బహిరంగంగా సన్నిహితంగా వుండలేని వైస్ చాన్సలర్లు ఇబ్బందులనెదుర్కోవాల్సి వస్తోంది. యూనివర్శిటీ నిర్వహణలో ఆర్ఎస్ఎస్ అతిగా జోక్యం చేసుకుంటోందని రాజస్థాన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా. దేవ్‌రూప్ బహిరంగంగానే ఫిర్యాదు చేశాడు. ఆయన వారసుని ఎంపిక చేయవల్సిన సెర్చ్ కమిటీకి ఆర్ఎస్ఎస్ మద్దతు కల్గిన వైస్ చాన్సలర్ కైలాస్ సోథ్ నాని నాయకత్వం వహిస్తున్నారు. రాజస్థాన్ యూనివర్శిటీ సిండికేట్‌లోని ఇద్దరు సభ్యులు ఆర్ఎస్ఎస్ మద్దతు కల్గిన అఖిలభారతీయ రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్‌కు చెందినవారే. బెనారస్ హిందూ యూనివర్శిటీకి ఆర్ఎస్ఎస్ కార్యకర్త గిరీష్ చంద్ర త్రిపాఠి 2014 నవంబరు 14న వైస్ చాన్సలర్‌గా నియమితుడయ్యాడు. ఆయన పేరున మదనమోహన్ మాలవ్యా మనమడు, విశ్రాంత న్యాయమూర్తి గిరిధర్ మాలవ్యా సెర్చ్ – కమ్ సెలక్షన్ కమిటీకి సిఫార్సు చేయబడ్డారు. వారణాశి నుండి లోక్‌సభకు పోటీచేసిన నరేంద్రమోడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన గిరిధర్ మాలవ్యా, గిరీష్ చంద్ర త్రిపాఠి పాతమిత్రులని పత్రికలు పేర్కొన్నాయి.

హర్యానాలోBJP ప్రభుత్వం అధికారంలోకి రాగానే, గత ప్రభుత్వం వివిధ సాహిత్య అకాడమీలకు చేసిన నియామకాలను రద్దు చేసింది.

NIT నాగపూర్ : నాగపూర్‌లోని విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అధిపతిగా పేరొందిన ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవక్ విశ్రాం రామచంద్ర జమ్దార్ నియమించబడ్డారు. ఈ పదవికి ఎంపిక చేసిన వారి జాబితాలో ఆయన పేరు లేకపోయినప్పటికీ ఈ వున్నత పదవికి నియమించబడ్డారు

**టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చి (TIFR) :**

సైద్ధాంతిక భౌతిక శాస్త్రజ్ఞుని (Theoritical physicist)గా పనిచేస్తున్న డా. సందీప్ త్రివేది డైరెక్టర్ నియామకాన్ని ప్రధానమంత్రి కార్యాలయం (PMO) తిరస్కరించింది. ఒక డైరెక్టర్ నియామకాన్ని సాంకేతికపరమైన కారణాలతో పిఎంఓ తిరస్కరించడం ఇదే ప్రప్రథమం. త్రివేది ప్రథమ స్థానంలో వున్న సైద్ధాంతిక భౌతిక శాస్త్రజ్ఞుడు. ఆయన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియోరిటికల్ సైన్సెస్ (ITS) అడ్వైజరీ బోర్డు సభ్యుడు. 2005లోనే భౌతిక శాస్త్ర విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డును, 2010లో భౌతిక శాస్త్రాల విభాగంలో ఇన్ఫోసిస్ అవార్డును అందుకున్నారు. ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న అవార్డు డా. CNR రావ్ ఈ విషయంలో జోక్యం చేసుకోవల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడిని కోరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. బెంగుళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చి అధిపతి నియామకం విషయంలోనూ ఇదే విధంగా జరిగిందని డా. రావ్ ఆరోపించారు. ఆయన నియామకం విషయం పున: పరిశీలించవల్సిందిగా ఆ సంస్థ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని కోరింది. చిట్టచివరకు ప్రధానమంత్రి అధ్యక్షుడుగా వున్న నియామకాల క్యాబినెట్ కమిటీ (అప్పాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్– ACC) ఆయన నియామకాన్ని ఆమోదించింది. ఈ విషయంలో వ్యధచెందిన శ్రీ త్రివేదీ తన సహచరుల ఒత్తిడి మేరకు చివరకు అంగీకరించారు.

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IIT) :**

రోపార్, భువనేశ్వర్, పాట్నా IITల డైరెక్టర్ల ఎంపిక విషయంలో HRD మంత్రితో ఏర్పడిన తీవ్ర విబేధాల కారణంగా ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అనిల్ కాకోద్కర్, IIT బొంబాయి గవర్నింగ్ బాడీకి రాజీనామా చేశాడు. గతంలో జరిగిన ఎంపిక విధానాన్ని తుంగలో తొక్కి అప్పటికే ఇంటర్వ్యూ చేసిన 37 మంది అభ్యర్థులను

మరల ఇంటర్వ్యూకు పిలవాలని HRD మంత్రిత్వ శాఖ చేసిన నిర్ణయాన్ని, మంత్రిత్వ శాఖ తమ కనుకూలురను ఎంపిక  చేసేందుకే జోక్యం చేసుకున్నదని, సెర్చ్ – కమ్ – సెలక్షన్ కమిటీలోని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. మంత్రిత్వ శాఖ తమకు నచ్చిన వారిని నియమించేందుకే ఈ నిర్ణయంతీసుకుంది. అని భావించడం జరిగింది.

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, సిమ్లా (IIAS) :**

2014 మే నెలలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బిజేపీ విజయం పొందిన తర్వాత IIAS చైర్మన్‌గా వున్న గోపాలకృష్ణ గాంధీ, ఆ పదవికి రాజీనామా చేశారు. HRD మంత్రి స్మృతి ఇరానీ, యీ పదవికి రాజస్థాన్‌లోని బికనీర్‌లో వున్న మహారాజా గంగాసింగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చంద్రకళా పాడియాను నియమించినట్లు పత్రికలు పేర్కొన్నాయి. ఈ పదవికి అర్హులైన వారితో అంతకుముందే తయారుచేసిన ప్యానెల్‌లో ఆమె పేరు లేదు. పాలక పార్టీలో సనాతన భావాలు కల్గిన వారికి ఆమె భావాలు బాగా నచ్చుతాయని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక పేర్కొంది.

*